www.prajavinikidi.com

RNI.No :TELTEL/2023/85745

ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం

తెలుగు దినపత్రిక

సంపుటి - 4 సంచిక -194 శనివారం 31 అక్టోబర్ 2026 ఎడిటర్ : మారేపల్లి అశోక్ పేజిలు 8 వెల - 3/- 01

Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Disttircts

విలేకరులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక

తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు

జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను

ఆసక్తి గలవారు సంప్రదించండి

8978701613,7013016545

దేశాభివృద్ధి కొందరికి ఇష్టం లేదు

- ప్రతిపక్షాలపై ప్రధాని మోడీ విమర్శలు
- గ్యాస్, ఎరువుల కొరతపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపణ
- రైతులపై అంతర్జాతీయ ధరల భారం పడకుండా చర్యలు

రైతుల ఖాతాల్లోకి పీఎం-కిసాన్ 24వ విడత నిధులు..

9.34 కోట్ల మందికి రూ.18,680 కోట్లు!

బనస్కాంత అక్టోబర్ 30(ప్రజావినికిడి)::దేశం అభివృద్ధి పథంలో ముందుకు సాగడం కొన్ని రాజకీయ పార్టీలకు ఇష్టం లేదని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ విమర్శించారు. ఇరాన్ యుద్ధం, గల్ఫ్ ప్రాంతంలో ఉద్రిక్తతల నేపథ్యంలో దేశంలో వంటగ్యాస్, ఎరువుల కొరత ఏర్పడుతుందంటూ ప్రతిపక్షాలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయని ఆరోపించారు. దేశం కష్టకాలాన్ని ఎదుర్కొంటున్నప్పుడు ప్రభుత్వానికి అండగా నిలవాల్సింది పోయి, రాజకీయ ప్రయోజనాల కోసం ప్రజల్లో భయాందోళనలు సృష్టిస్తున్నాయని మండిపడ్డారు. **మిగతా 2లో...**

2027 జనవరి 25 నుంచి దేశవ్యాప్తంగా జనగణన



ఉత్తరాఖండ్ హెలికాప్టర్ ప్రమాదం విషాదాంతం.. ఆరుగురి మృతి

నింగిలోకి జీఎస్ఎల్వీ ఎఫ్18 రాకెట్

నావిగేషన్ వ్యవస్థకు మరింత బలోపేతం

శ్రీహరికోట నుంచి ఎన్వీఎస్-03 ఉపగ్రహం విజయవంతంగా ప్రయోగం

శ్రీహరికోట అక్టోబర్ 31: (ప్రజావినికిడి): భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) మరో కీలక విజయాన్ని సాధించింది. దేశీయ నావిగేషన్ వ్యవస్థను మరింత బలోపేతం చేసే లక్ష్యంతో ఎన్వీఎస్-03 ఉపగ్రహాన్ని జీఎస్ఎల్వీ-ఎఫ్18 రాకెట్ ద్వారా విజయవంతంగా నింగిలోకి పంపింది. **మిగతా 2లో...**

ప్రభుత్వ భూములను కొల్లగొట్టే కుట్ర

రూ.1.50 లక్షల కోట్ల ప్రభుత్వ భూములను కాపాడాం: సీఎం రేవంత్ రెడ్డి

- మియాపూర్‌లో 550 ఎకరాలపై సుప్రీంకోర్టు తీర్పు
- భూముల విలువ రూ.50 వేల కోట్లు అని సీఎం వెల్లడి
- రూ.1.50 లక్షల కోట్ల ప్రభుత్వ భూములు కాపాడినట్లు ప్రకటన
- కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావుపై భూ ఆక్రమణ ఆరోపణలు
- భూముల విక్రయ నిధులతో అభివృద్ధి పనుల ప్రతిపాదన

న్యూఢిల్లీ: అక్టోబర్ 30(ప్రజావినికిడి): మియాపూర్‌లో 550 ఎకరాల భూమిపై సుప్రీంకోర్టు తీర్పు తెలంగాణ ప్రభుత్వానికి అనుకూలంగా రావడంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఢిల్లీలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ భూముల పరిరక్షణ, గతంలో జరిగిన భూ లావాదేవీలపై మాట్లాడారు. రాష్ట్రంలో తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.1.50 లక్షల కోట్ల విలువైన ప్రభుత్వ భూములను కాపాడినట్లు తెలిపారు. మియాపూర్ భూముల విలువ సుమారు రూ.50 వేల కోట్లు ఉంటుందని పేర్కొన్నారు. మియాపూర్ భూముల వ్యవహారంలో మాజీ సీఎం కేసీఆర్, ఆయన బంధువు దామోదర్‌రావు, గోల్డ్‌స్టోన్ ప్రసాద్‌పై రేవంత్‌రెడ్డి ఆరోపణలు చేశారు. ఈ భూ లావాదేవీల్లో లగ్జరీ కార్లు లంచంగా ఇచ్చారని, నగదు రూపంలో ముడుపులు అందాయని ఆరోపించారు. తాను ఎమ్మెల్యేగా, **మిగతా 2లో...**

సింగరేణి కార్మికులకు మరో బోనస్..

- ఒక్కొక్కరికి గరిష్ఠంగా రూ. 1.10 లక్షల చొప్పున చెల్లింపు
- నవంబర్ 5న కార్మికుల ఖాతాల్లోకి రూ. 419 కోట్లు జమ
- దసరా, దీపావళి బోనస్‌లు కలిపి ఒక్కో కార్మికుడికి రూ. 2.65 లక్షల లబ్ధి
- సుమారు 38,000 మంది కార్మికులకు ప్రయోజనం

హైదరాబాద్ అక్టోబర్ 30,(ప్రజావినికిడి): తెలంగాణ ప్రభుత్వం సింగరేణి కార్మికులకు మరో శుభవార్త అందించింది. ఇటీవల దసరా పండుగ సందర్భంగా భారీ బోనస్ అందుకున్న కార్మికులకు, ఇప్పుడు దీపావళి కానుకగా మరో భారీ బోనస్‌ను ప్రకటించింది. దీని కింద ఒక్కో కార్మికుడికి గరిష్ఠంగా రూ. 1,10,250 చొప్పున మొత్తం రూ. 419 కోట్లను చెల్లించనుంది. ఈ నిర్ణయంతో సింగరేణి వ్యాప్తంగా ఉన్న సుమారు 38,000 మంది కార్మికులు లబ్ధి పొందనున్నారు. **మిగతా 2లో...**

ప్రచారానికి తెర

పోలింగ్‌పై ఉత్కంఠ

రేపే 92 పట్టణ స్థానిక సంస్థలకు పోలింగ్

- మరో 8 చోట్ల పూర్తి స్థాయిలో ఏకగ్రీవం
- ఉదయం 7 నుంచి సాయంత్రం 5 వరకు ఎన్నికలు
- 13 కార్పొరేషన్లు, 73 మున్సిపాలిటీలు, 6 నగర పంచాయతీలకు
- ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి.. ముగిసిన ప్రచారం
- అధికారం, ఆధిపత్యంపై ప్రధాన పార్టీల గురి

అమరావతి, అక్టోబర్ 30,(ప్రజావినికిడి):: రాష్ట్రంలో పట్టణ రాజకీయాలు మరింత వేడెక్కాయి. మున్సిపల్ ఎన్నికలకు సర్వం సిద్ధమైంది. శుక్రవారంతో ప్రచార గడువు ముగిసింది. రాష్ట్రవ్యాప్తంగా 92 పట్టణ స్థానిక సంస్థలకు**మిగతా 2లో...**

హైదరాబాద్‌ను ముంచెత్తిన కుండపోత వర్షం

- ప్రధాన రహదారులన్నీ జలమయం
- పలు ప్రాంతాల్లో గంటల తరబడి నిలిచిపోయిన ట్రాఫిక్
- ఇళ్లకు వెళ్లే వేళ ఉద్యోగులు, ప్రయాణికుల తీవ్ర ఇబ్బందులు
- ఎండ వేడిమి నుంచి నగరవాసులకు ఊరట



హైదరాబాద్ అక్టోబర్ 30(ప్రజావినికిడి): శుక్రవారం సాయంత్రం హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. అకస్మాత్తుగా కురిసిన కుండపోత వానతో నగర జీవనం అస్తవ్యస్తంగా మారింది. గంటకు పైగా ఏకధాటిగా వర్షం పడటంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. డ్రైనేజీలు పొంగిపొర్లడంతో పలు లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి.నగరంలోని ఖైరతాబాద్, పంజాగుట్ట, సోమాజిగూడ, అమీర్‌పేట్, ఎస్ఆర్ నగర్, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, ఫిల్మ్ నగర్ వంటి ప్రధాన **మిగతా 2లో...**

కొత్త రైల్వే మార్గాలకు అనుమతులు ఇవ్వండి

- హైస్పీడ్ రైల్ల మార్గాల పనులు వేగవంతం చేయండి
- అనంతారంలో మెగా ఫ్రైట్ నిర్వహణ డిపో ఏర్పాటు చేయండి
- రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు సీఎం రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి

న్యూఢిల్లీ: అక్టోబర్ 30,(ప్రజావినికిడి): తెలంగాణ రాష్ట్రానికి ప్రకటించిన హైస్పీడ్ రైలు మార్గాల పనులను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు శుక్రవారం ఢిల్లీలోని రైల్‌భవన్‌లో కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో సీఎం సమావేశమై రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక రైల్వే ప్రాజెక్టులపై చర్చించారు. హైదరాబాద్‌పుణె, హైదరాబాద్‌బెంగళూరు, హైదరాబాద్‌చెన్నై హైస్పీడ్ రైలు కారిడార్లకు సంబంధించి కేంద్రం పంపిన ప్రతిపాదనలను రాష్ట్ర ప్రభుత్వం **మిగతా 2లో...**

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక

దేశాభివృద్ధి కొందరికి ఇష్టం లేదు

మొదటిపేజీ తరువాయి

శుక్రవారం గుజరాత్‌లోని బనస్కాంతలో జరిగిన కార్యక్రమంలో ఆయన ప్రతిపక్షాలపై ఈ వ్యాఖ్యలు చేశారు. గల్ఫ్ ప్రాంతంలో నెలకొన్న ఉద్రిక్తతల కారణంగా ఎరువులు, వంటగ్యాస్ కొరత ఏర్పడుతుందంటూ కొందరు పుకార్లు వ్యాప్తి చేస్తున్నారని మోడీ అన్నారు. దేశ ప్రజలంతా అభివృద్ధి చెందిన భారత్ నిర్మాణం కోసం కృషి చేస్తుంటే, కొన్ని రాజకీయ పార్టీలు మాత్రం దేశం ఇబ్బందుల్లో పడాలని కోరుకుంటున్నాయని విమర్శించారు. యువత, మహిళలు, బాలికలు దేశాభివృద్ధి లక్ష్య సాధనలో భాగస్వాములవుతున్నారని పేర్కొన్నారు. ఇలాంటి సమయంలో ప్రజల్లో అనవసర ఆందోళనలు కలిగించే ప్రచారం చేయడం సరికాదన్నారు.

ప్రపంచవ్యాప్తంగా ఎరువుల ధరలు పెరుగుతున్నప్పటికీ ఆ భారం భారత రైతులపై పడకుండా తమ ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ప్రధాని తెలిపారు. గల్ఫ్ ప్రాంతంలో ఉద్రిక్తతలు కొనసాగుతున్నా అంతర్జాతీయ మార్కెట్లలో ఎరువుల ధరల పెరుగుదల ప్రభావం రైతులపై పడకుండా ప్రయత్నిస్తున్నామని చెప్పారు. కష్టకాలంలో రైతులకు అండగా ఉంటానని గతంలో ఇచ్చిన హామీని ఈ సందర్భంగా గుర్తుచేశారు.

వ్యవసాయ రంగంలో సైన్స్, టెక్నాలజీ వినియోగాన్ని పెంచేందుకు గత 12 ఏళ్లుగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మోడీ వివరించారు. వ్యవసాయంతో పాటు పశుపోషణ, పాల ఉత్పత్తి రంగాల్లోనూ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తెస్తున్నట్లు తెలిపారు. సాయిల్ హెల్త్ కార్డు పథకాన్ని ఇందుకు ఉదాహరణగా పేర్కొన్నారు.

గతంలో రైతులు తమ పొలాలకు ఏ రకమైన ఎరువులు, ఎంత పరిమాణంలో అవసరమో తెలుసుకోవడంలో ఇబ్బందులు ఎదుర్కొనేవారని చెప్పారు. సాయిల్ హెల్త్ కార్డుల ద్వారా భూసారాన్ని తెలుసుకుని, అవసరమైన ఎరువులను వినియోగించుకునే అవకాశం కలిగిందన్నారు. దేశవ్యాప్తంగా రైతులకు 26 కోట్లకు పైగా సాయిల్ హెల్త్ కార్డులు పంపిణీ చేసినట్లు ప్రధాని వెల్లడించారు. వాతావరణ మార్పులను రైతులు సమర్థంగా ఎదుర్కొనేందుకు కొత్త విత్తన రకాలను అందుబాటులోకి తీసుకొస్తున్నామని తెలిపారు. గత కొన్నేళ్లలో దాదాపు 3 వేల కొత్త విత్తన రకాలను రైతులకు అందించామని చెప్పారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటలు సాగు చేసేందుకు ఇవి ఉపయోగపడతాయని వివరించారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో పశుపోషణ, డెయిరీ రంగాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని మోడీ పేర్కొన్నారు. ఈ రంగాల అభివృద్ధిలో మహిళల పాత్ర ఎంతో ముఖ్యమని అన్నారు. గత దశాబ్ద కాలంగా పశు పోషణ, పాల ఉత్పత్తి రంగాల్లో సైన్స్, టెక్నాలజీని అనుసంధానం చేసేందుకు ప్రభుత్వం దృష్టి సారించిందని తెలిపారు. మెరుగైన పశు జాతుల అభివృద్ధి ద్వారా పాల ఉత్పత్తిని మరింత పెంచుకునే అవకాశం ఉందని ప్రధాని వివరించారు.

రైతుల ఖాతాల్లోకి పీఎం-కిసాన్ 24వ విడత నిధులు..

ప్రధాని నరేంద్ర మోదీ గుజరాత్‌లోని బనస్కాంత జిల్లా భీల్డి వేదికగా ప్రధాన్ మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి 24వ విడత నిధులను అధికారికంగా విడుదల చేశారు. డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ ద్వారా దేశవ్యాప్తంగా అర్హులైన రైతుల బ్యాంక్ ఖాతాల్లోకి ఈ సొమ్ము జమ అయింది. దేశవ్యాప్తంగా మొత్తం 9.34 కోట్ల మంది రైతు కుటుంబాలకు లబ్ధి చేకూరింది. ఈ విడత కింద మొత్తం రూ. 18,680 కోట్ల నిధులను కేంద్ర ప్రభుత్వం విడుదల చేసింది. ప్రతీ అర్హత కలిగిన రైతు ఖాతాలో ఉచితంగా రూ. 2,000 చొప్పున సాయం ట్రాన్స్ ఫర్ చేశారు. ఈ విడతలో భాగంగా ఒక్క గుజరాత్ రాష్ట్రంలోనే 52.33 లక్షలకు పైగా రైతు కుటుంబాలకు రూ.1,051 కోట్లకు పైగా ఆర్థిక సాయం అందింది. ఈ పథకం ద్వారా ఏటా ప్రతి రైతు కుటుంబానికి రూ. 6,000 చొప్పున మూడు విడతల్లో (విడతకు రూ. 2,000) ఆర్థిక సాయం అందజేస్తారు. ఇప్పటివరకు దాఖలైన 24 విడతల ద్వారా దేశవ్యాప్తంగా రైతులకు రూ. 4.65 లక్షల కోట్లకు పైగా నిధులు నేరుగా చేరాయి

ప్రభుత్వ భూములను కొల్లగొట్టే కుట్ర

మొదటిపేజీ తరువాయి

ఎంపీగా, టీపీసీసీ అధ్యక్షుడిగా ఉన్నప్పటి నుంచే ఈ వ్యవహారంపై పోరాడుతున్నట్లు చెప్పారు. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో మియాపూర్ భూముల పరిరక్షణకు తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు వెల్లడించారు.

ఐఎంజీ భూములు, కంచ గచ్చిబౌలి, మామిడిపల్లి, గుర్రంగూడ అటవీ భూములు, మంచిరేవులలోని 143 ఎకరాలు సహా పలు ప్రాంతాల్లో ప్రభుత్వ భూములను కాపాడినట్లు సీఎం వివరించారు. ఈ వ్యవహారాల్లో కేటీఆర్, బీఆర్ఎస్ నేతల ప్రమేయం ఉందంటూ ఆరోపణలు చేశారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 400 ఎకరాల అటవీ భూమి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని భూముల అంశాలనూ ప్రస్తావించారు. పద్మాలయ స్టూడియోస్, లాంకో భూముల కేసులను అధికారంలో ఉన్నప్పుడు ఎందుకు పరిష్కరించలేదని కేసీఆర్, హరీశ్‌రావును ప్రశ్నించారు. హరీశ్‌రావు మామ హన్మంతరావుపై కూడా ప్రభుత్వ భూమి ఆక్రమణ ఆరోపణలు చేశారు. ఇవన్నీ ముఖ్యమంత్రి చేసిన ఆరోపణలే. ప్రభుత్వ భూములను విక్రయించి వచ్చిన నిధులను విద్య, సాగునీరు, వైద్యం, ఇతర అభివృద్ధి కార్యక్రమాలకు వినియోగించే ఆలోచనలో ఉన్నట్లు రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఈ ప్రతిపాదనను రాష్ట్ర మంత్రివర్గం ముందుకు తీసుకెళ్లనున్నట్లు చెప్పారు. వనరుల సమీకరణ కోసం ఏర్పాటు చేసిన మంత్రివర్గ ఉపసంఘం భూముల విక్రయ ప్రతిపాదనలను పరిశీలించి, ఆ నిధులతో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను గుర్తిస్తుందని తెలిపారు. మియాపూర్ తీర్పుపై కేసీఆర్, కేటీఆర్ స్పందించాలని, అసెంబ్లీ వేదికగా బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు.

లక్షన్నర కోట్ల భూములను రక్షించాం

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కేసీఆర్ కుటుంబ కబంధ హస్తాల్లోని దాదాపు రూ.1.50 లక్షల కోట్ల ప్రభుత్వ భూములను రక్షించామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. గత పదేళ్ల పాలనలో కేసీఆర్ కుటుంబం, అనుచరులు సాగించిన భారీ భూ దోపిడీని ఆధారాలతో సహా బట్టబయలు చేశారు. "మియాపూర్‌లోని 550 ఎకరాల భూమిపై సర్వహక్కులూ ప్రభుత్వానికే చెందుతాయని సుప్రీం కోర్టు వెల్లడించిన తీర్పు చారిత్రాత్మకమైనది. ఈ గొప్ప తీర్పు ఇచ్చిన న్యాయమూర్తులు జస్టిస్ సుందరేశ్, జస్టిస్ సతీష్ చంద్ర శర్మలకు తెలంగాణ ప్రజల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు" అని వ్యాఖ్యానించారు. ఇకనైనా భూ కబ్జాలు మానెయ్యాలని కేసీఆర్ తన బృందానికి చెప్పాలని హితవు పలికారు.

ఐఎంజీ భరత్ సహా వేల కోట్ల భూముల రక్షణ

గతంలో గచ్చిబౌలిలో 400 ఎకరాలు, మామిడిపల్లిలో 450 ఎకరాలు కలిపి మొత్తం 850 ఎకరాలను ఐఎంజీ భరత సంస్థకు కేటాయించగా, అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి దానిని రద్దు చేశారని సీఎం రేవంత్ గుర్తుచేశారు. గత ప్రభుత్వం కమీషన్లకు కక్కుర్తిపడి కోర్టులో వారికి అనుకూలంగా వ్యవహరించిందని, తాము అధికారంలోకి వచ్చాక సుప్రీంకోర్టులో పోరాడి రూ.40 వేల కోట్ల విలువైన ఆ భూమిని కాపాడామని స్పష్టం చేశారు. గడిచిన మూడేళ్లలో ప్రధానమైన ఏడు భూములను కేసీఆర్, కుటుంబ సభ్యులు, కబ్జాదారుల నుంచి రక్షించామని తెలిపారు. మియాపూర్‌లోని 550 ఎకరాల భూమి వాటిలో ఒకటని చెప్పారు. న్యాయస్థానంలో సమర్థ వాదనలు వినిపించడం ద్వారా ఐఎంజీ భారత్ భూములను కాపాడామని చెప్పారు.

అలాగే, హయత్ నగర్ మండలం సాహెబ్‌నగర్ కలాన్ సర్వే నెం. 201లో 140 ఎకరాల భూమిని కాపాడామని గుర్తు చేశారు. శేరిలింగంపల్లి మండలం కొండాపూర్ సర్వే నెం. 59లోని 36 ఎకరాల (దాదాపు రూ. 3,600 కోట్ల విలువైన) భూమిని న్యాయస్థానంలో పోరాటం చేసి స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. గండిపేట మండలం మంచిరేవులలో 143 ఎకరాల ప్రభుత్వ భూమిని రక్షించామన్నారు. భూపాలపల్లి జిల్లాలో రూ.400 కోట్ల విలువైన 106 ఎకరాల అటవీ భూమిని ఒక రాజకీయ నాయకుడికి నజరానాగా అప్పగిస్తే, సుప్రీంకోర్టులో పోరాడి దానిని కాపాడామని వివరించారు. కొత్తగూడెం జిల్లాలో 600 ఎకరాల అటవీ భూమిని రక్షించామన్నారు. ఈ భూములను అమ్మి, ఆ నిధులను నూరు శాతం ప్రజా ప్రయోజనాల కోసమే వినియోగిస్తామని, దళితులు, గిరిజనులు, ఆదివాసీలు, అట్టడుగు వర్గాల పిల్లలకు మెరుగైన విద్యావకాశాలు కల్పించడం కోసం ఖర్చు చేస్తామని ప్రకటించారు. ఇందిరమ్మ ఇళ్లు, సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి ఉపయోగిస్తామని చెప్పారు.

"గోదావరి జలాలను ఏపీ ప్రభుత్వం మళ్లించుకుంటోందని, రేవంత్ రెడ్డి నిర్లక్ష్యం వల్లే ఇదంతా జరుగుతోందని కేటీఆర్, హరీశ్ అనడం వాళ్ల అవివేకానికి నిదర్శనం. ఏ రాజకీయ నేత అయినా తన రాష్ట్ర ప్రయోజనాలను, తన రాజకీయ భవిష్యత్తును పక్కనబెట్టి, పొరుగు రాష్ట్ర ప్రయోజనాలను కాపాడతారా? భద్రాచలం దిగువన లభించే గోదావరి జలాలను మళ్లించుకునేలా పోలవరం - బనకచర్ల ప్రాజెక్టును ప్రతిపాదించింది మాజీ ముఖ్యమంత్రి కేసీఆరే! అసెంబ్లీ సాక్షిగా.. భద్రాచలం దిగువన ఉన్న మిగులు నీటిని వాడుకోమని ఉచిత సలహా చంద్రబాబుకు ఇచ్చింది ఆయనే" అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు.

ప్రచారానికి తెర... పోలింగ్‌పై ఉత్కంఠ

మొదటిపేజీ తరువాయి

ఆదివారం పోలింగ్ జరగనుంది. ఇందులో 13 మున్సిపల్ కార్పొరేషన్లు, 73 మున్సిపాలిటీలు, 6 నగర పంచాయతీలు ఉన్నాయి. షెడ్యూల్ ప్రకటించిన 87 మున్సిపాలిటీలు/నగర పంచాయతీల్లో 17 'మున్సిపల్' చైర్‌పర్సన్ స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. ఇందులో 8 చోట్ల అన్ని వార్డులతో సహా పూర్తి స్థాయిలో ఏకగ్రీవం కావడంతో అక్కడ ఎన్నికలు జరగడం లేదు. మిగిలిన చోట్ల ఎక్కువ వార్డులు ఏకగ్రీవమవగా, కొన్ని వార్డులకు మాత్రమే ఎన్నికలు జరుగుతున్నాయి. తొలుత అక్టోబరు 28న పోలింగ్ నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్ణయించింది. నామినేషన్ల సందర్భంగా చోటుచేసుకున్న పరిణామాలు, సుప్రీంకోర్టు జోక్యంతో ఎన్నికల ప్రక్రియలో కీలకమార్పులు జరిగాయి. దీంతో పోలింగ్‌ను నవంబరు 1కి వాయిదా వేశారు. అవసరమైన చోట 2న రీపోలింగ్, 3న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. ఆదివారం ఉదయం 7 నుంచి సాయంత్రం 5 వరకు పోలింగ్ నిర్వహిస్తారు.

రాష్ట్రంలోని ప్రధాన నగరాల్లో ఎన్నికలు ప్రతిష్ఠాత్మకంగా మారాయి. విజయవాడ, విశాఖపట్నం, గుంటూరు, తిరుపతి వంటి ప్రధాన నగరాల్లో గెలుపు ఎవరికి దక్కుతుందన్నది ఆసక్తికరంగా మారింది. ఎన్నికలు జరుగుతున్న గ్రేటర్ విశాఖ, విజయవాడ, విజయనగరం, ఏలూరు, మచిలీపట్నం, గుంటూరు, ఒంగోలు, నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, కడప, కర్నూలు, అనంతపురం నగరాల్లో మేయర్ పీఠం దక్కించుకోవడం ద్వారా పట్టణ ప్రాంతాల్లో తమ రాజకీయ బలాన్ని నిరూపించుకోవాలని ప్రధాన పార్టీలు భావిస్తున్నాయి. ఈ సారి మేయర్లకు ప్రత్యక్ష ఎన్నికలు నిర్వహిస్తుండటంతో ఓటర్లు నేరుగా ఎన్నుకుంటారు. మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో చైర్‌పర్సన్ పదవులు ఏకగ్రీవంగా ఎన్నికైన స్థానాల్లో అధికార కూటమి ఆధిక్యం ప్రదర్శించింది. టీడీపీకి అత్యధిక స్థానాలు 15, జనసేన, బీజేపీలకు చెరో స్థానం దక్కాయి. అలాగే కూటమి మద్దతుతో 639 మంది వార్డు, డివిజన్ అభ్యర్థులు ఏకగ్రీవమయ్యారు. ఈ ఎన్నికల్లో కూటమి పట్టణ ప్రాంతాల్లో తమ పాలనకు ప్రజామోదం ఉందని నిరూపించుకోవాల్సిన అవసరముంది. మరోవైపు వైసీపీకి పట్టణ ఓటర్లలో తమ బలాన్ని తిరిగి చాటుకోవాల్సిన సవాల్ ఎదురవుతోంది. ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రచారాస్త్రాలుగా కూటమి మలచుకుంటోంది. అత్యధిక స్థానాల్లో గెలవాలని టీడీపీ, కూటమిలో భాగస్వామిగా పోటీ చేస్తున్న స్థానాల్లో తన రాజకీయ బలాన్ని పెంచుకోవాలని జనసేన చూస్తోంది. పట్టణ ప్రాంతాల్లో తన ఉనికిని విస్తరించుకునే ప్రయత్నం బీజేపీ చేస్తోంది. ప్రభుత్వ వ్యతిరేకత, స్థానిక సమస్యలు, నామినేషన్ల సందర్భంగా ఎదురైన ఇబ్బందులను ప్రధాన ప్రచార అంశాలుగా వైసీపీ ముందుకు తెస్తోంది.

శుక్రవారం సాయంత్రం 5 గంటలకు ఎన్నికల ప్రచారం ముగిసింది. చివరి రోజున ఓటర్లను ఆకట్టుకునేందుకు పార్టీలు, అభ్యర్థులు అన్నీ ప్రయత్నాలు చేశారు. ఇంటింటి ప్రచారం, స్థానిక సమస్యలపై హామీలతో ప్రచారం హోరెత్తింది. పోలింగ్ స్వేచ్ఛగా, ప్రశాంతంగా జరిగేలా ఎన్నికల సంఘం, పోలీసు యంత్రాంగం ఏర్పాట్లు చేశారు. గతంలో నామినేషన్ల సందర్భంగా వివాదాలు తలెత్తిన నేపథ్యంలో సున్నిత ప్రాంతాల్లో భద్రత, పోలింగ్ కేంద్రాల పర్యవేక్షణ కీల కంగా మారాయి. మరోవైపు పోటీ చేస్తున్న అభ్యర్థుల నామినేషన్ పత్రాలను ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎన్నికల సంఘం హైకోర్టుకు తెలిపింది. ఓటర్లు అభ్యర్థుల వివరాలు తెలుసుకునేందుకు ఇది ఉపయోగపడనుంది.

హైదరాబాద్‌ను ముంచెత్తిన కుండపోత వర్షం

ప్రాంతాల్లో రోడ్లపైకి భారీగా వరద నీరు చేరింది. దీంతో ఆఫీసుల నుంచి ఇళ్లకు వెళ్లే ఉద్యోగులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సాయంత్రం రద్దీ సమయం కావడంతో ట్రాఫిక్ కష్టాలు రెట్టింపయ్యాయి. ముఖ్యంగా ఐటీ కారిడార్‌లో పరిస్థితి తీవ్రంగా మారింది. మాదాపూర్, హైటెక్‌సిటీ, కేపీహెచ్‌బీ, మైండ్‌స్పేస్, ఐకియా మార్గాల్లో వాహనాలు కిలోమీటర్ల మేర బారులు తీరాయి. మాదాపూర్ సిటీ వైన్స్ వద్ద ప్రధాన రహదారి చెరువును తలపించడంతో రాకపోకలు పూర్తిగా స్తంభించాయి. కుత్బుల్లాపూర్ నుంచి సూరారం

వరకు, షాపూర్ నుంచి గాజులరామారం వరకు కూడా భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. వర్షానికి తడుస్తూ కొందరు ప్రయాణికులు మెట్రో పిల్లర్ల కింద తలదాచుకోగా, మరికొందరు గంటల తరబడి ట్రాఫిక్‌లోనే చిక్కుకుపోయారు. ఉప్పల్, ఎల్బీనగర్, మణికొండ, రాయదుర్గం, రాజేంద్రనగర్ వంటి నగర శివారు ప్రాంతాల్లోనూ ఇదే పరిస్థితి కనిపించింది. అయితే, గత కొన్ని రోజులుగా నగరంలో తీవ్రమైన ఎండలు, ఉక్కపోతతో అల్లాడిపోతున్న ప్రజలకు ఈ వర్షం కాస్త ఉపశమనం కలిగించింది.

నింగిలోకి జీఎస్ఎల్‌వీఎఫ్18 రాకెట్

మొదటిపేజీ తరువాయి

శుక్రవారం రాత్రి 11.51 గంటలకు ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీహరికోట సతీశ్ ధావన్ అంతరిక్ష కేంద్రం నుంచి ఈ ప్రయోగం చేపట్టారు. రెండో ప్రయోగ వేదిక నుంచి నింగిలోకి దూసుకెళ్లిన ఈ రాకెట్ జీఎస్ఎల్‌వీ కార్యక్రమంలో 20వ ప్రయోగంగా నిలిచింది. సుమారు 50 మీటర్ల ఎత్తు కలిగిన మూడు దశల వాహక నౌక ద్వారా 2,232 కిలోల బరువున్న ఎన్‌వీఎస్-03 ఉపగ్రహాన్ని జియోసింక్రోనస్ ట్రాన్స్‌ఫర్ ఆర్బిట్‌లోకి ప్రవేశపెట్టారు. భారత ప్రాంతీయ నావిగేషన్ ఉపగ్రహ వ్యవస్థ (ఐఆర్ఎన్ఎస్ఎస్) ప్రస్తుతం నావిక్ (ఛీఖుజ×జ)గా పిలవబడుతోంది. దేశీయంగా అభివృద్ధి చేసిన ఈ వ్యవస్థ ద్వారా భారత్‌తో పాటు దేశ సరిహద్దుల నుంచి సుమారు 1,500 కిలోమీటర్ల పరిధిలో కచ్చితమైన స్థాన సమాచారాన్ని అందించవచ్చు. ఈ వ్యవస్థలో సేవల నిరంతర కొనసాగింపునకు రూపొందించిన రెండో తరం ఉపగ్రహాల్లో ఎన్‌వీఎస్-03 మూడోది. ఎన్‌వీఎస్-03 ఉపగ్రహంలో స్వదేశీ అణు గడియారంతో పాటు ఇతర అణు గడియారాలను కూడా అమర్చారు. అత్యంత కచ్చితమైన సమయాన్ని నిర్ధారించడంలో ఇవి కీలక పాత్ర పోషిస్తాయి. ఇప్పటికే ఉన్న ఎల్5, ఎస్-బ్యాండ్ సిగ్నళ్లకు అదనంగా కొత్తగా ఎల్1 సిగ్నల్ సామర్థ్యాన్ని కూడా ఇందులో చేర్చారు. దీనివల్ల నావిక్ వ్యవస్థ సేవలు మరింత విస్తృతం కానున్నాయి. నావిక్ వ్యవస్థ రవాణా, నౌకాయానం, విమానయానం, అత్యవసర సేవలు, వ్యక్తిగత నావిగేషన్ వంటి అనేక రంగాల్లో ఉపయోగపడుతుంది. ఉపగ్రహంలోని అణు గడియారాలు సమయ నిర్ధారణలో అత్యంత కచ్చితత్వాన్ని అందిస్తాయి. జీపీఎస్ వంటి విదేశీ వ్యవస్థలపై ఆధారపడకుండా స్వదేశీ నావిగేషన్ సామర్థ్యాన్ని పెంపొందించుకోవడంలో ఈ ప్రయోగం కీలక ముందడుగుగా నిలిచింది.

కొత్త రైల్వే మార్గాలకు అనుమతులు ఇవ్వండి

మొదటిపేజీ తరువాయి

సమీక్షించి, కొన్ని మార్పులను సూచిస్తూ తిరిగి పంపినట్లు ముఖ్యమంత్రి తెలిపారు. కేంద్రం నుంచి తుది అలైన్‌మెంట్ ఆమోదం వచ్చిన తర్వాతే భూసేకరణ ప్రక్రియ ప్రారంభిస్తామని స్పష్టం చేశారు. ఈ మూడు మార్గాలకు సంబంధించిన అలైన్‌మెంట్ ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని కేంద్ర మంత్రిని కోరారు. వికారాబాద్‌కృష్ణా మధ్య 130 కిలోమీటర్ల కొత్త రైల్వే మార్గాన్ని వెంటనే మంజూరు చేయాలని సీఎం విజ్ఞప్తి చేశారు. వికారాబాద్ జిల్లా టేకల్‌కోడ్ పరిసరాల్లో భారీ సున్నపురాయి నిక్షేపాలు ఉన్నందున ఆ ప్రాంతాన్ని సిమెంట్, టెక్స్‌టైల్ హబ్‌గా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించినట్లు వివరించారు. అలాగే హైదరాబాద్ చుట్టూ సుమారు 360 కిలోమీటర్ల మేర నిర్మిస్తున్న రీజినల్ రింగ్ రోడ్డు పక్కనే రీజినల్ రింగ్ రైలు మార్గాన్ని ఏర్పాటు చేసేలా అలైన్‌మెంట్ రూపొందించాలని కోరారు. ఈ ప్రాజెక్టు ద్వారా పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. డోర్నకల్‌గద్వాల, కల్వకుర్తిమాచర్ల, కాచిగూడజగ్గయ్యపేట (250 కి.మీ.), పటాన్‌చెరుఆదిలాబాద్ (320 కి.మీ.), బోధన్‌లాతూర్ (175 కి.మీ.), అక్కన్నపేట బైపాస్ లైన్ (8 కి.మీ.) ప్రాజెక్టులను వెంటనే మంజూరు చేయాలని ముఖ్యమంత్రి కోరారు. మహబూబాబాద్ సమీపంలోని అనంతారం గ్రామంలో దక్షిణ మధ్య రైల్వే ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న మెగా కోచింగ్, ఫ్రైట్ నిర్వహణ డిపోను ఏర్పాటు చేయాలని సీఎం సూచించారు. ఈ డిపో నిర్మాణానికి అవసరమైన 409 ఎకరాల ఒక గుంట భూమిని రైల్వే శాఖకు అప్పగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే అంగీకరించిందని తెలిపారు. ఈ ప్రాజెక్టుకు త్వరితగతిన అనుమతులు మంజూరు చేయాలని కేంద్ర మంత్రిని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర మంత్రి వివేక్ వెంకటస్వామి, పలువురు ఎంపీలు, రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

2027 జనవరి 25 నుంచి దేశవ్యాప్తంగా జనగణన

న్యూఢిల్లీ: అక్టోబర్ 30,(ప్రజావినికిడి):: దేశవ్యాప్తంగా 2027 జనవరి 25 నుంచి ఫిబ్రవరి 28 వరకు జనగణన నిర్వహించనున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. శుక్రవారం ఈ మేరకు ప్రకటన విడుదల చేసింది. అయితే ఎన్నికలు జరగనున్న రాష్ట్రాలకు జనగణన నుంచి మినహాయింపు ఇచ్చినట్లు వెల్లడించింది. ఉత్తరప్రదేశ్, మణిపూర్, గోవా, పంజాబ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లో ఈ సమయంలో జనగణన నిర్వహించబోమని స్పష్టం చేసింది. దేశ జనాభాకు సంబంధించిన తాజా వివరాలను సేకరించేందుకు ఈ ప్రక్రియ చేపట్టనున్నారు. జనగణన ద్వారా జనాభా గణాంకాలు, ప్రభుత్వ పథకాల రూపకల్పన, అభివృద్ధి ప్రణాళికలకు అవసరమైన సమాచారం అందుబాటులోకి రానుంది.

ఉత్తరాఖండ్ హెలికాప్టర్ ప్రమాదం విషాదాంతం.. ఆరుగురి మృతి

బద్రీనాథ్ అక్టోబర్ 30(ప్రజావినికిడి):

ఉత్తరాఖండ్‌లో శుక్రవారం ఘోర హెలికాప్టర్ ప్రమాదం చోటుచేసుకోవడం తెలిసిందే. ఈ దుర్ఘటన విషాదాంతంగా ముగిసింది. బద్రీనాథ్ నుంచి సహస్రధార వెళుతున్న ఓ ప్రైవేట్ హెలికాప్టర్ జోషిమఠ్ సమీపంలోని చాయ్ గ్రామ సమీపంలో కుప్పకూలింది. ఈ ప్రమాదంలో పైలట్‌తో సహా హెలికాప్టర్‌లో ప్రయాణిస్తున్న ఐదుగురు యాత్రికులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ప్రమాద వార్త అందిన వెంటనే ఉత్తరాఖండ్ పోలీస్, రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన దళం (రాణ=ఖీ), ఆర్మీ బృందాలు సంయుక్తంగా రంగంలోకి దిగి సహాయక చర్యలు చేపట్టాయి. అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం, మృతుల్లో హెలికాప్టర్ పైలట్ కెప్టెన్ హిమాన్షు సభర్వాల్ (ఢిల్లీ) కాగా, ప్రయాణికులను ప్రతాప, అరుణ్, శంకర్ గౌడ, సుధీర్ కె, హెచ్.ఎస్. నటరాజాగా గుర్తించారు. వీరంతా కర్ణాటకకు చెందినవారని పోలీసులు తెలిపారు. ప్రమాద స్థలం నుంచి ఆరుగురి మృతదేహాలను వెలికితీసినట్లు అధికారులు ధ్రువీకరించారు. మృతదేహాలను రోడ్డు మార్గం ఉన్న ప్రాంతానికి తరలించే పనులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. చమోలీ ఎస్పీ సుర్జీత్ సింగ్ పన్వార్ వెల్లడించిన వివరాల ప్రకారం, "ట్రాన్స్ భారత్ ఏవియేషన్" సంస్థకు చెందిన ఈ హెలికాప్టర్ మధ్యాహ్నం 1.12 గంటలకు బద్రీనాథ్ సివిల్ హెలిప్యాడ్ నుంచి బయలుదేరింది. కేవలం రెండు నిమిషాల వ్యవధిలోనే, మధ్యాహ్నం 1.14 గంటల సమయంలో జోషిమఠ్ సమీపంలో హెలికాప్టర్‌తో సంబంధాలు తెగిపోయాయి. హెలికాప్టర్ గాల్లో ఉండగానే అదుపుతప్పి లోయలోకి దూసుకెళ్లడం చూశామని సమీప ప్రాంతాల్లోని స్థానికులు తెలిపారని ఆయన వివరించారు. ఉత్తరాఖండ్ సివిల్ ఏవియేషన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ఖజణూ) కూడా ఈ విషయాన్ని ధ్రువీకరించింది. హెలికాప్టర్‌తో కమ్యూనికేషన్ తెగిపోవడంతో పాటు, ట్రాకింగ్ సిస్టమ్ నుంచి కూడా అది అదృశ్యమైనట్లు తెలిపింది. ఈ దుర్ఘటన నేపథ్యంలో, ముందుజాగ్రత్త చర్యగా ట్రాన్స్ భారత్ ఏవియేషన్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు చెందిన అన్ని హెలికాప్టర్ల సేవలను తక్షణమే నిలిపివేస్తున్నట్లు యూసీడీఏ ప్రకటించింది. ఇదిలా ఉండగా, రాష్ట్రంలో వరుసగా జరుగుతున్న హెలికాప్టర్ ప్రమాదాలపై ఉత్తరాఖండ్ మాజీ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత హరీశ్ రావత్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. "ఇది చాలా బాధాకరమైన విషయం. రాష్ట్రంలో హెలికాప్టర్ సేవలను సురక్షితంగా మార్చాల్సిన అవసరం ఉంది. వరుసగా ఇలాంటి సంఘటనలు జరగడం ఆందోళన కలిగిస్తోంది. దీనిపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి, తగిన మార్పులు చేయాలి" అని ఆయన డిమాండ్ చేశారు.

సింగరేణి కార్మికులకు మరో బోనస్..

నెల రోజుల వ్యవధిలోనే సింగరేణి కార్మికులు రెండు భారీ బోనస్‌లు అందుకోనుండటం విశేషం. ఇటీవల దసరా బోనస్‌గా ఒక్కొక్కరికి గరిష్ఠంగా రూ. 1.54 లక్షల వరకు చెల్లించారు. ఇప్పుడు ప్రకటించిన దీపావళి బోనస్‌తో కలిపి, కేవలం రెండు పండుగలకు ఒక్కో కార్మికుడు సగటున/గరిష్ఠంగా రూ. 2.65 లక్షల వరకు ప్రయోజనం పొందనున్నారు. ఈ రెండు బోనస్‌ల కోసం సింగరేణి సంస్థ మొత్తంగా రూ. 1,020 కోట్లకు పైగా వెచ్చిస్తోంది. ఇది కార్మికుల పట్ల యాజమాన్యం నిబద్ధతను తెలియజేస్తోంది.

ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క ఆదేశాల మేరకు సింగరేణి యాజమాన్యం ఈ నిర్ణయం తీసుకుంది. ఈ బోనస్ మొత్తాన్ని నవంబర్ 5వ తేదీన నేరుగా అర్హులైన కార్మికుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలని సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాశ్ జ్యోతి సంబంధిత విభాగాలను ఆదేశించారు. ఈ బోనస్ నేషనల్ కోల్ వేజ్ అగ్రిమెంట్ (చీజఔూ) పరిధిలోని కార్మికులకు మాత్రమే వర్తిస్తుందని, అధికారులకు ఇది వర్తించదని యాజమాన్యం స్పష్టం చేసింది. గత ఆర్థిక సంవత్సరంలో భూగర్భ గనుల్లో కనీసం 190 రోజులు, ఓపెన్‌కాస్ట్ గనులు లేదా సర్ఫేస్ విభాగాల్లో 240 రోజులు పనిచేసిన వారికి పూర్తి బోనస్ లభిస్తుంది. కనీసం 30 రోజులు పనిచేసిన వారికి, వారు పనిచేసిన దినాల నిష్పత్తి ప్రకారం బోనస్ చెల్లిస్తారు. ఒకదాని తర్వాత ఒకటిగా రెండు భారీ బోనస్‌లు ప్రకటించడంతో సింగరేణి కార్మికులు, వారి కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ నిర్ణయం వారిలో పండుగ ఉత్సాహాన్ని రెట్టింపు చేసింది.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక
శనివారం 31 అక్టోబర్ 2026

ఏజెన్సీ భూ సమస్యలు, చట్టాల పై భారీ ధర్నా

వాజేడు,అక్టోబర్ 31,(ప్రజావినికిడి):
వాజేడు మండల కేంద్రంలో శుక్రవారం ఆదివాసి నవనిర్మాణ సేనా ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో ఎఎన్ఎస్, ఆదివాసి నవనిర్మాణ సేనా సోషల్ మీడియా ప్రతినిధి పాయం అజయ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఆదివాసి నవనిర్మాణ సేనా ములుగు జిల్లా అధ్యక్షులు ఎట్టి విద్యాసాగర్ మాట్లాడుతూ, సోమవారం నాడు వెంకటాపురం మండలంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న భూ సమస్యల పై ఏజెన్సీ చట్టాల అమలుపై ధర్నా కార్యక్రమం వుంటుంది కావున ఆదివాసీ గిరిజనులు అందరూ అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయగలరని ఎఎన్ఎస్,ఆదివాసి నవనిర్మాణ సేనా తరుపున పిలుపునిస్తున్నాం,అలాగే ఏజెన్సీలో ప్రతి గ్రామ పంచాయతీలో పీసా గ్రామ సభలు నిర్వహించాలని గిరిజనేతరులు ఇండ్లు నిర్మించాలంటే ముందు పర్మిషన్ తీసుకున్నాక మాత్రమే ఇల్లు మొదలు పెట్టాలని అన్నారు.అలాగే రెవిన్యూ అధికారులు మండల డౌలప్మెంట్ అధికారులు చోరవతిసుకొని చట్టాన్ని ఉల్లంఘించినా వారిపై చర్యలు తీసుకోవాలని అన్నారు.అలాగే పీసా గ్రామాసభ నిర్వహించకుండా ఎలాంటి పర్మిషన్ ఇవ్వకూడదని అన్నారు.ఈ కార్యక్రమంలో ఏఎన్ఎస్ రాష్ట్ర సోషల్ మీడియాలో ప్రతినిధి పాయం అజయ్, ఏఎన్ఎస్ మండల కార్యదర్శి యలం అశోక్,నాయకు పర్శిక రామక్రిష్ణ,మొడెం బాబురావు, మడప. పగిడయ్య తదితరులు పాల్గొన్నారు.

మండల స్థాయి ఓరియంటేషన్ కార్యక్రమం

వాజేడు,అక్టోబర్ 31,(ప్రజావినికిడి):వాజేడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నాగారం నందు మండల స్థాయి లో ప్రశస్త 2.0 వన్డే ఓరియంటేషన్ ప్రోగ్రాం నిర్వహించడం జరిగింది. వాజేడు మండల విద్యాశాఖ అధికారి తేజావత్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, ప్రతి పాఠశాల లో ఉన్న ప్రత్యేక అవసరాలు గల పిల్లలను గుర్తించాలి అని తెలియడం జరిగింది.ఈ కార్యక్రమానికి సయ్యద్ అలీముద్దీన్ ఖాద్రి,మోడెం లక్ష్మి,దుర్గానంద్, రిసోర్స్ పర్సన్స్ గా వ్యవహరించారు. ఈ కార్యక్రమం లో 3 నుండి 18 సంవత్సరాల పిల్లలలో 21 రకాల వైకల్యాల లక్షణాలను 61 ప్రశ్నల ద్వారా ఉపాధ్యాయులు, స్పెషల్ ఎడ్యుకేటర్లు త్వరగా గుర్తించి, సరైన సమయంలో ప్రత్యేక శ్రద్ధ, సహాయక బోధన, అవసరమైతే చికిత్స,థెరపీ, యుడిఐడి,కార్డు పొందవచ్చని వివరించారు.ఈ కార్యక్రమంలో వాజేడు మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల, కళాశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

అంబర్ పేట్ ఎస్బి ఏసీపీ యాస మొగిలి ని మర్యాదపూర్వకంగా కలిసిన వ్యాపారవేత్త రమేష్ గోపాల్ దాస్

అంబర్ పేట్,(ప్రజావినికిడి):అంబర్ పేట్ స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ యాస మొగిలి ని అంబర్ పేట్ విద్యానగర్ కు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త రమేష్ గోపాల్ దాస్ మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా ఏసీపీ మొగిలి శాలువా తో సన్మానించి పూల బొకే అందించారు. విధి నిర్వహణ లో ఎంతో నిబద్ధత తో పని చేసే ఏసీపీ మొగిలి లాంటి అధికారులను కలవడం ఎంతో ఆనందంగా ఉందని రమేష్ అన్నారు.ఈ కార్యక్రమంలో సూరంపల్లి నీలేష్,రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ సురభి వాణీదేవి చేతుల మీదుగా చెక్కుల పంపిణీ

షాద్ నగర్,(ప్రజావినికిడి):షాద్ నగర్ నియోజకవర్గంలోని కేశంపేట మండలం కొండారెడ్డిపల్లి గ్రామానికి చెందిన కె.అనూషకు రూ.60,000, వినయకు రూ.60,000 చొప్పున మొత్తం రూ.1,20,000 సీఎం సహాయనిధి చెక్కులు మంజూరయ్యాయి.మాజీ ఎమ్మెల్యే వై.అంజయ్య యాదవ్ ప్రత్యేక చొరవతో,ఎమ్మెల్సీ సురభి వాణీదేవి సహకారంతో ఈ చెక్కులు మంజూరు కాగా, ఎమ్మెల్సీ సురభి వాణీదేవి చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేశారు.ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ,పదవిలో ఉన్నా లేకున్నా ప్రజల కోసం,కార్యకర్తల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్న మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఆపదలో ఉన్న వారికి అండగా నిలుస్తూ,అవసరమైన సమయంలో సహాయం అందించేందుకు ఆయన చేస్తున్న కృషి అభినందనీయమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ యువ నాయకులు కానం ప్రేమ్ కుమార్ గౌడ్,ఉప సర్పంచ్ కర్నెకోట నరేష్,నాయకులు కంది రాఘవేందర్ గౌడ్,దశరథ్,తేజ యాదవ్,హరీష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ నిధులపై రాజకీయ నాయకుల పెత్తనం

గ్రామ పంచాయతీ అభివృద్ధి అడ్డుకుంటున్న రాజకీయ నాయకులు జీఎస్పి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూనెం సాయి దొర

వాజేడు,అక్టోబర్ 31,(ప్రజావినికిడి):
ఏజెన్సీ ప్రాంతంలో గ్రామ పంచాయతీల నిధుల పై రాజకీయ నాయకుల పెత్తనం ఏమిటని, ఆదివాసి గ్రామాల అభివృద్ధికి అడ్డపడితే సహించబోమని పూనెం సాయి మండిపడ్డారు. శుక్రవారం వెంకటాపురం మండలం కమ్మరిగూడెం గ్రామంలో గోండ్వానా సంక్షేమ పరిషత్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. గొండ్వానా సంక్షేమ పరిషత్ ములుగు జిల్లా అధ్యక్షులు పూనెం ప్రతాప్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి.రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూనెం సాయి దొర హాజరై మాట్లాడుతూ, ఏజెన్సీ ప్రాంతమైన వెంకటాపురం మండలంలో గ్రామపంచాయతీలో రాజకీయ పార్టీ నాయకుల పెత్తనం ఏమిటని ఆయన తీవ్రస్థాయిలో మండిపడ్డారు. గ్రామ పంచాయతీ అభివృద్ధికి ప్రతిక్షణం రాజకీయ పార్టీల నాయకులు అడుగడుగున అడ్డుపడుతున్నారని అన్నారు.
అమాయకులైన ఆదివాసీలను రాజకీయ పార్టీల తరపు నుండి సర్పంచులు గా గెలిపించి.ఎవరైతే పార్టీ అభ్యర్థులు ఉంటారో,వాళ్లు గెలుపొందే వరకే వారి బాధ్యత ఉంటుందని తర్వాత వారి విధులని గ్రామ పంచాయతీ అభివృద్ధికి మాత్రమే నిర్వహించాలి తప్ప రాజకీయ పార్టీ నాయకుల మాటలు వినోద్దని ఆయన అన్నారు.ఏజెన్సీ గ్రామ పంచాయతీలోకి రాజకీయ పార్టీ నాయకులను రాకుండా అడ్డుకున్నప్పుడే ఆదివాసి గ్రామాలు అభివృద్ధి చెందుతాయని,మన చట్టాలు పూర్తి స్థాయిలో అమలు అవుతాయని ఆయన అన్నారు. ఆదివాసి గ్రామ పంచాయతీలోకి రాజకీయ పార్టీలను రాకుండా బహిష్కరించాలని ఆదివాసులకు పిలుపునిచ్చారు. ఏజెన్సీ గ్రామ పంచాయతీ అభివృద్ధికి రాజకీయ పార్టీలు నాయకులు అడ్డుపడితే సహించబోమని తీవ్రస్థాయిలో హెచ్చరించారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల వలన ఆదివాసి చట్టాలు రాలేదని ఎంతోమంది ఆదివాసి అమరవీరుల ప్రాణ త్యాగాలు చేస్తే ఆదివాసి చట్టాలు వచ్చాయని గుర్తుచేశారు.అలాగే ఆదివాసి ప్రజా ప్రతినిధులు కూడా గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఉందని,ఈనాడు ఏజెన్సీ చట్టాలు ఉన్నందునే ఆదివాసి రిజర్వేషన్ పై గెలుపొంది అధికారంలో ఉన్నారని,అదే ఆ చట్టాలు నిర్వీర్యం జరిగితే రేపు ఈ రిజర్వేషన్ కూడా ఉండదని,ఇది ప్రతి ఒక్క ఆదివాసి ప్రజా ప్రతినిధులు గుర్తుపెట్టుకోవాలని తెలిపారు. ఏజెన్సీ చట్టాలు నేడు రద్దు చేయాలని రాజకీయ పార్టీలే కంకణం కట్టుకున్నాయని ఈ సందర్భంగా తెలిపారు.అలాగే ఆదివాసి అభివృద్ధి జరగకుండా అడ్డుకునే ప్రయత్నం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో పూనెం విజయ్, ప్రసాద్, కృష్ణార్జునరావు, దినేష్.తదితరులు పాల్గొన్నారు.

ఏపీలో అర్నాబ్ తుఫాను బాధితులకు షాద్‌నగర్ విద్యుత్ సిబ్బంది సేవలు

ఏపీలో విద్యుత్ మరమ్మతులకు షాద్‌నగర్ విద్యుత్ శాఖ నుంచి నాలుగు బృందాలు

షాద్ నగర్,(ప్రజావినికిడి): ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో అర్నాబ్ తుఫాను కారణంగా విద్యుత్ వ్యవస్థ తీవ్రంగా దెబ్బతింది. తుఫాను ప్రభావంతో 16 వేలకుపైగా విద్యుత్ స్తంభాలు దెబ్బతినగా,పలు ప్రాంతాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు కూడా దెబ్బతిన్నాయి.
విద్యుత్ సరఫరాను త్వరితగతిన పునరుద్ధరించేందుకు రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ ఎలక్ట్రిసిటీ డివిజన్ నుంచి సుమారు 45 మంది సభ్యులతో కూడిన నాలుగు ప్రత్యేక బృందాలు ఆంధ్రప్రదేశ్‌కు బయలుదేరాయి. ఏపీలోని తూర్పు గోదావరి,పశ్చిమ గోదావరి,కృష్ణా జిల్లాల్లో ఈ బృందాలు మరమ్మతు పనులు చేపట్టి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించనున్నాయి.ఈ బృందాలను రాజేంద్రనగర్ సర్కిల్,షాద్‌నగర్ డివిజన్ డీఈ శ్యామ్‌సుందర్ రెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,
తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఏడీఈలు సత్యనారాయణ,రవీందర్,పట్టణ ఏఈ వినోద్ కుమార్,పలువురు ఏఈలు,ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.ఆపద సమయంలో ఇతర ప్రాంతాల ప్రజలకు విద్యుత్ సేవలు అందించేందుకు షాద్‌నగర్ సిబ్బంది ముందుకు రావడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు

ఓం శివశక్తి పరిశ్రమ కాలుష్యంపై అధికారులకు గ్రామస్తుల వినతి

కంపెనీ కాలుష్యంపై ఆర్డీఒ,ఏసీపీ,సీఐలకు వినతిపత్రాలు

షాద్ నగర్,(ప్రజావినికిడి): నియోజకవర్గంలోని కందివనం గ్రామ శివారులో ఉన్న ఓం శివశక్తి స్పాంజ్ ఐరన్ పరిశ్రమ నుంచి వెలువడుతున్న కాలుష్యంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతూ గ్రామస్తులు అధికారులను ఆశ్రయించారు. ఈ మేరకు షాద్‌నగర్ ఆర్డీఒ సరిత,ఏసీపీ లక్ష్మీనారాయణ, సీఐ సీతారాంలకు వినతిపత్రాలు అందజేశారు.పరిశ్రమ నుంచి నిత్యం వెలువడుతున్న పొగ, కాలుష్యాన్ని తక్షణమే నియంత్రించాలని,గ్రామ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.కేవలం నామమాత్రపు చర్యలతో సరిపెట్టకుండా, కాలుష్యానికి కారణమవుతున్న పరిశ్రమపై నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జెమిలీ అమృనాయక్, ఉపసర్పంచ్ విజయ యాదగిరి రెడ్డి,వార్డు సభ్యులు సర్సింలు, మల్లేష్, బాలకృష్ణ గౌడ్, మహేందర్ ,గ్రామ పెద్దలు శంకరయ్య గౌడ్,వెంకట్ రెడ్డి, నర్సింలు గౌడ్,కుర్వ పెంటయ్య, లక్ష్మణ్ నాయక్,రమేష్

ముదిరాజ్,లంద నరేష్,మల్లేష్ ముదిరాజ్‌తో పాటుగ్రామయువకులు,నాయకులు పాల్గొన్నారు.

ఎస్ఐఆర్‌పై దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలి

ప్రజల్లో నెలకొన్న అపోహలను తొలగించాలి - పారదర్శక ఓటర్ల జాబితాతోనే ప్రజాస్వామ్య పరిరక్షణ

వరంగల్ అక్టోబర్ 30 (ప్రజావినికిడి):ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలు, ప్రచారాల నేపథ్యంలో ప్రజలకు వాస్తవాలను వివరించి అపోహలను తొలగించడమే లక్ష్యంగా బీజేపీ ధర్మసాగర్ మండల శాఖ రంగంలోకి దిగింది. మండల అధ్యక్షుడు బైరపాక కుమార్ ఆధ్వర్యంలో మండలంలోని ప్రముఖులు, ఓటర్లను కలిసి ఎస్ఐఆర్ ప్రక్రియపై అవగాహన కల్పిస్తూ చర్చా కార్యక్రమం నిర్వహించారు.
ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు సోమిడి వెంకట్ రెడ్డి, స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గ నాయకుడు బొజ్జపల్లి సుభాష్ హాజరై మాట్లాడారు. ఎస్ఐఆర్ ప్రక్రియపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీతో పాటు కాంగ్రెస్, ఇండియా కూటమి నాయకులు చేస్తున్న ఆరోపణల నేపథ్యంలో ప్రజలు వాస్తవాలను తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఆధారాలు లేని ప్రచారాలతో ప్రజల్లో



గందరగోళం సృష్టించే ప్రయత్నాలను వాస్తవాలతోనే ఎదుర్కోవాలని పేర్కొన్నారు.
ప్రజాస్వామ్యానికి ఓటర్ల జాబితానే పునాది అని, అందులో పారదర్శకత అత్యంత కీలకమని స్పష్టం చేశారు. అర్హులైన ఓటర్ల పేర్లు జాబితాలో ఉండేలా, అనర్హమైన నమోదులు ఉంటే నిబంధనల ప్రకారం సరిదిద్దేలా ఎన్నికల సంఘం చేపట్టే ప్రక్రియపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలన్నారు. ఓటర్లు తమ పేర్లు, ఇతర వివరాలను తప్పనిసరిగా పరిశీలించుకోవాలని సూచించారు. ఓటు హక్కు విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం చేయకుండా ప్రజాస్వామ్య పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.ఎస్ఐఆర్‌పై జరుగుతున్న రాజకీయ ఆరోపణలు, ప్రత్యారోపణల మధ్య ప్రజలు అపోహలకు లోనుకాకుండా అధికారిక సమాచారాన్ని పరిశీలించాలని నాయకులు కోరారు. ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో విశ్వాసం పెంపొందించేందుకు వాస్తవాలను గ్రామస్థాయిలోకి తీసుకెళ్లడమే తమ లక్ష్యమని తెలిపారు.
ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు నాగవెల్లి యుగేందర్, గంకిడి వెంకట్ రెడ్డి, గాజుల సంపత్, దాసరి సదానందం, మండల ప్రధాన కార్యదర్శులు బచ్చు శివప్రసాద్ రెడ్డి, సాయం సందీప్, కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు వెంకటేష్, బీజేవైఎం మండల అధ్యక్షుడు చింత రఘుదీర్, చింతల రాజు, సాంబరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక

37 ఏళ్ల అంకితభావానికి అభినందనల వెల్లువ

పదవీ విరమణ వేళ ప్రధానోపాధ్యాయురాలు మూసా వనజకు ఘన సత్కారం

ఎల్బీనగర్,(ప్రజావినికిడి):
హయత్‌నగర్ హెచ్‌డబ్ల్యు పరిధిలోని ఎంపీపీఎస్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మూసా వనజ పదవీ విరమణ సందర్భంగా పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్‌ఎం సురేష్ కుమార్ అధ్యక్షతన ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. గత 37 సంవత్సరాలుగా ఉపాధ్యాయురాలిగా, ప్రధానోపాధ్యాయురాలిగా విద్యారంగానికి విశేష సేవలందించిన ఆమె రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయురాలిగా గుర్తింపు పొందారు. ఈ సందర్భంగా అధికారులు, తోటి ఉపాధ్యాయులు, సహచరులు, విద్యార్థులు పూలవర్షం కురిపిస్తూ ఆమెను ఘనంగా సత్కరించి, అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమానికి హయత్‌నగర్ ఎంఈఓ శ్రీనివాసులు, ఎస్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు సదానందం గౌడ్, బాలల హక్కుల సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి రఘునందన్, హయత్‌నగర్ కాంప్లెక్స్ హెచ్‌ఎం రమాదేవి, సాహెబ్‌నగర్ గెజిటెడ్ హెచ్‌ఎం దినేష్, పీఆర్‌టీయూ హయత్‌నగర్ మండల అధ్యక్షుడు దీన్‌దయాల్, ఎస్‌టీయూ మండల అధ్యక్షుడు ఏడుకొండలుతో పాటు పలువురు ఉపాధ్యాయులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో మూసా వనజ చేసిన కృషి, అందించిన సేవలు అభినందనీయమని కొనియాడారు. 37 ఏళ్ల సుదీర్ఘ విద్యా ప్రస్థానంలో ఆమె ప్రదర్శించిన అంకితభావం, క్రమశిక్షణ, సేవానిరతి ఉపాధ్యాయ

లోకానికి ఆదర్శమని పేర్కొన్నారు. అనంతరం మూసా వనజ మాట్లాడుతూ, తన 37 ఏళ్ల ఉద్యోగ జీవితంలో ఎన్నో మధుర జ్ఞాపకాలు, అనుభవాలు ఉన్నాయని తెలిపారు. తాను ఈ స్థాయికి ఎదగడంలో కుటుంబ సభ్యుల సహకారం ఎంతో ఉందని పేర్కొన్నారు. ముఖ్యంగా తన భర్త కృష్ణయ్య అందించిన ప్రోత్సాహం, సహకారం, అండదండలు మరువలేనివని భావోద్వేగంగా తెలిపారు. తన వృత్తి జీవితంలోని ప్రతి అడుగులోనూ తోడుగా నిలిచిన భర్తకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. విద్యారంగానికి మూసా వనజ అందించిన 37 ఏళ్ల సేవలు చిరస్మరణీయమని, పదవీ విరమణ అనంతరం ఆమె జీవితం ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో నిండాలని ఈ సందర్భంగా పలువురు ఆకాంక్షించారు.

యాసంగిలో ఆరుతడి పంటలే రైతులకు రక్షణ కవచం!

-ఎల్‌నినో ముప్పు పొంచి ఉన్న వేళ నీటి వృథాకు స్వస్తి పలకాలి

-తక్కువ నీటితో అధిక దిగుబడులు సాధించే పంటల వైపు రైతులు మళ్లాలి

ధర్మసాగర్/(ప్రజావినికిడి):
యాసంగి సాగులో రైతులు పాత పద్ధతులకు స్వస్తి పలికి పరిస్థితులకు అనుగుణంగా పంటల ప్రణాళిక రూపొందించుకోవాలని వ్యవసాయ అధికారులు సూచించారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావం, నీటి కొరత ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో అధిక నీటిని కోరే పంటలపై ఆధారపడితే రైతులు ఆర్థికంగా నష్టపోయే ప్రమాదం ఉందని, ఆరుతడి పంటల సాగుతోనే నీటి ఎద్దడిని అధిగమించి పెట్టుబడి భారాన్ని తగ్గించుకోవచ్చని స్పష్టం చేశారు. క్షేత్ర పరిరక్షణ అభియాన్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ధర్మసాగర్ రైతు వేదికలో సర్పంచ్ అధ్యక్షతన యాసంగి ఆరుతడి పంటల సాగుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి మాట్లాడుతూ ప్రస్తుత వాతావరణ పరిస్థితులను ముందుగానే అంచనా వేసుకుని రైతులు పంటల ఎంపిక చేసుకోవాలని సూచించారు. తక్కువ నీటితో పండే ఆరుతడి పంటలను సాగు చేయడం ద్వారా నీటి కొరతను అధిగమించడంతో పాటు తక్కువ వ్యవధిలో ఆదాయం పొందే అవకాశం ఉంటుందన్నారు. రసాయన ఎరువుల వినియోగాన్ని విచ్చలవిడిగా పెంచకుండా సేంద్రియ ఎరువులు, పచ్చిరొట్ట ఎరువులకు ప్రాధాన్యత

ఇవ్వాలని, భూసారాన్ని కాపాడుకోవాలని సూచించారు. పురుగుమందులను ఇష్టారాజ్యంగా వినియోగిస్తే పంటలకే కాకుండా రైతుల పెట్టుబడులకు కూడా నష్టం తప్పదని, శాస్త్రీయంగా సూచించిన మోతాదులోనే వాడాలని హెచ్చరించారు. సర్పంచ్ మాట్లాడుతూ ఒకప్పుడు ధర్మసాగర్ ప్రాంతంలో ఆరుతడి పంటల సాగు విస్తృతంగా ఉండేదని, కాలక్రమేణా ఆ సాగు కనుమరుగవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. పరిస్థితులు అనుకూలించకపోయినా అధిక నీటి పంటలనే ఆశ్రయించడం వల్ల రైతులు ఇబ్బందులు ఎదుర్కొనే ప్రమాదం ఉందన్నారు. వర్షాభావ పరిస్థితుల్లో ఆరుతడి పంటలే రైతులకు మేలు చేస్తాయని, పాత సాగు విధానాలను మళ్లీ ప్రోత్సహించి నీటి వనరులను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. ఏపీవో మాట్లాడుతూ బీబీజీ రామ్ పథకం కింద వివిధ రకాల పనులు అందుబాటులో ఉన్నాయని, రైతులు ఈ అవకాశాలను గుర్తించి సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు రాజేందర్, బాలకృష్ణ, దివ్య, పీఏసీఎస్ సిబ్బంది, పంచాయతీ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రాష్ట్ర పక్షి పాలపిట్ట పరిరక్షణకు చర్యలు అవసరం!

అంతరించిపోయే ప్రమాదం నుంచి కాపాడేందుకు సమష్టి కృషి చేయాలి

అక్టోబర్ 30,(ప్రజావినికిడి):
తెలంగాణ రాష్ట్ర పక్షిగా గుర్తింపు పొందిన పాలపిట్ట మనుగడను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ప్రకృతి అందాలకు ప్రతీకగా నిలిచే ఈ పక్షి వ్యవసాయ రంగానికి కూడా ఎంతో మేలు చేస్తుంది. అయితే సహజ ఆవాసాల తగ్గుదల, చెట్ల నరికివేత, వ్యవసాయంలో రసాయనిక పురుగుమందుల వినియోగం వంటి కారణాలు పక్షుల మనుగడకు ముప్పుగా మారుతున్నాయి. పాలపిట్టల సంరక్షణపై ప్రభుత్వ శాఖలు, రైతులు, ప్రజలు ప్రత్యేక దృష్టి సారించాలని పర్యావరణ ప్రేమికులు సూచిస్తున్నారు....

రైతులకు మేలు చేసే పాలపిట్ట...

పాలపిట్ట కేవలం అందమైన పక్షి మాత్రమే కాదు..పర్యావరణ సమతుల్యతలోనూ కీలక పాత్ర పోషిస్తుంది. పొలాల్లో కనిపించే కొన్ని కీటకాలు, పురుగులను ఆహారంగా తీసుకోవడం ద్వారా వ్యవసాయానికి పరోక్షంగా మేలు చేస్తుంది. పంట పొలాలు, చెట్లతో కూడిన ప్రాంతాలు, బహిరంగ ప్రదేశాలు ఈ పక్షికి అనుకూలమైన ఆవాసాలుగా ఉంటాయి. ప్రకృతిలో జీవవైవిధ్యాన్ని కాపాడటంలో పాలపిట్ట వంటి పక్షుల పాత్ర ఎంతో ముఖ్యమైనది...

ఆవాసాల నాశనంతో పెరుగుతున్న ముప్పు...

గ్రామీణ ప్రాంతాల్లో చెట్ల సంఖ్య తగ్గడం, పొలాల గట్లపై ఉన్న చెట్లను తొలగించడం, పక్షులకు అనుకూలమైన వాతావరణం కనుమరుగవడం వంటి పరిణామాలు వాటి మనుగడపై ప్రభావం చూపుతున్నాయి. వ్యవసాయంలో విచక్షణారహితంగా రసాయనిక పురుగుమందులను వినియోగించడం వల్ల పక్షులకు ఆహారంగా లభించే కీటకాలు తగ్గడంతో పాటు, విషపూరిత పదార్థాల ప్రభావం కూడా పడే ప్రమాదం ఉంది. ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని పాలపిట్టల సంరక్షణకు దీర్ఘకాలిక చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది...

పరిరక్షణకు సమష్టి కృషి అవసరం...

పాలపిట్టల మనుగడను కాపాడేందుకు గ్రామాల్లో చెట్ల పెంపకాన్ని ప్రోత్సహించాలి. పొలాల గట్లపై ఉన్న చెట్లను సాధ్యమైనంతవరకు సంరక్షించాలి. రైతులు సమగ్ర సస్యరక్షణ పద్ధతులను పాటిస్తూ అవసరమైన మేరకే పురుగుమందులను వినియోగించాలి. పక్షుల ఆవాసాలను కాపాడటంతో పాటు పాఠశాలలు, గ్రామపంచాయతీల ద్వారా ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. అటవీ, వ్యవసాయ శాఖలు సమన్వయంతో పనిచేస్తూ పక్షుల సంరక్షణకు అవసరమైన చర్యలు తీసుకోవాలి...

భవిష్యత్తు తరాలకు ప్రకృతి సంపదను అందిద్దాం..

రాష్ట్ర పక్షిగా పాలపిట్టకు ప్రత్యేక గుర్తింపు ఉన్నప్పటికీ, ఆ గుర్తింపు దాని సంరక్షణకు సరిపోదు. పక్షుల మనుగడకు అనుకూలమైన సహజ వాతావరణాన్ని కాపాడినప్పుడే వాటి సంఖ్య పెరిగే అవకాశాలు ఉంటాయి. ప్రకృతిలో ప్రతి జీవికి ప్రత్యేక స్థానం ఉంది. పాలపిట్టను కాపాడుకోవడం అంటే ఒక పక్షి జాతిని సంరక్షించడం మాత్రమే కాదు..పర్యావరణ సమతుల్యతను కాపాడుతూ భవిష్యత్తు తరాలకు ఆరోగ్యకరమైన ప్రకృతిని అందించడం కూడా. ఇప్పటికైనా పాలపిట్టల పరిరక్షణను సామాజిక బాధ్యతగా గుర్తించి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలి.

ట్యునీషియా సినీ ఉత్సవంలో భారత్‌కు ప్రత్యేక గుర్తింపు

'టోయాజ్' లఘుచిత్రానికి తృతీయ బహుమతి

హిమాయత్ నగర్, (ప్రజావినికిడి): అంతర్జాతీయ సినీ వేదికపై భారత్ మరోసారి తన ప్రతిభను చాటుకుంది. ట్యునీషియాలో అక్టోబర్ 24 నుంచి 27 వరకు నిర్వహించిన 12వ జెర్బా అంతర్జాతీయ మహిళలు, యువత సినిమా ఉత్సవంలో భారతీయ లఘుచిత్రం 'టోయాజ్' తృతీయ బహుమతిని గెలుచుకుంది. అభిజీత్ శ్రీవాస్తవ దర్శకత్వం వహించిన ఈ చిత్రం కథాంశం, సాంకేతిక నైపుణ్యంతో అంతర్జాతీయ ప్రేక్షకులను, న్యాయనిర్ణేతలను ఆకట్టుకుంది. ఈ ప్రతిష్ఠాత్మక ఉత్సవంలో భారత్ గౌరవ అతిథి దేశంగా పాల్గొనడం విశేషం. ప్రపంచవ్యాప్తంగా 38 దేశాలకు చెందిన 68 చిత్రాలను ఈ వేడుకలో ప్రదర్శించారు. మహిళలు, యువ సినీ దర్శకులను ప్రోత్సహించడం ఈ ఉత్సవ ప్రధాన ఉద్దేశం. ట్యునీషియాలోని భారత రాయబార కార్యాలయం ఈ విజయంపై హర్షం వ్యక్తం చేస్తూ, దర్శకుడు అభిజీత్ శ్రీవాస్తవతో పాటు చిత్ర బృందానికి అభినందనలు తెలిపింది. ఈ విజయం అంతర్జాతీయ స్థాయిలో భారతీయ సినిమాకు మరింత గుర్తింపును తీసుకురావడంతో పాటు, భారత్–ట్యునీషియా దేశాల మధ్య సాంస్కృతిక సంబంధాలు, సినీ రంగ సహకారాన్ని బలోపేతం చేయనుంది.

హెల్మెట్ ధారణపై వాహనదారులకు ట్రాఫిక్ పోలీసుల అవగాహన..

రహదారి భద్రతే లక్ష్యం.. -ట్రాఫిక్ సిఐ వెంకటేశ్వర్లు..

షాద్ నగర్,(ప్రజావినికిడి): షాద్ నగర్ నియోజకవర్గంలో రహదారి భద్రతపై ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు హెల్మెట్ వినియోగాన్ని ప్రోత్సహించేందుకు షాద్‌నగర్ ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో ఫారుక్ నగర్ మండలంలోని రాయికల్ టోల్ ప్లాజా వద్ద ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సీఐ వెంకటేశ్వర్లు హెల్మెట్ ధరించకుండా ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనదారులకు కొత్త హెల్మెట్లు కొనిపించి, వారి చేతుల మీదుగానేధరింపజేశారు. హెల్మెట్ ధరించడం వల్ల రోడ్డు ప్రమాదాల సమయంలో తలకు తీవ్ర గాయాలు కాకుండా ప్రాణాలను కాపాడుకునే అవకాశం ఉంటుందని వివరించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ట్రాఫిక్ నిబంధనలను నిర్లక్ష్యం చేయకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. వాహనం నడిపేటప్పుడు సెల్‌ఫోన్ వినియోగం, అతివేగం వంటి ప్రమాదకర చర్యలకు దూరంగా ఉండాలని కోరారు. ప్రతి ఒక్కరూ రహదారి భద్రతను తమ బాధ్యతగా భావించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ వెంకటేష్, ఏఎస్ఐ రవీందర్ పాల్గొనివాహనదారులకు రహదారి భద్రతపై పలు సూచనలు చేశారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు కార్యక్రమంలో ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి

ఎల్బీనగర్,(ప్రజావినికిడి):
ఎల్బీనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి లింగోజిగూడ డివిజన్ పరిధిలోని పోస్ట్ ఆఫీస్ వద్ద జరిగిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అర్హులైన పట్టభద్రులందరూ ఎమ్మెల్సీ ఓటరుగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని, ప్రజాస్వామ్య ప్రక్రియలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. పట్టభద్రులు తమ ఓటు హక్కును వినియోగించుకునేలా ఓటరు నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ భారస పార్టీ అధ్యక్షులు వరప్రసాద్ రెడ్డి, సీనియర్ నాయకులు తిలక్ రావు, రాకేష్ ఠాగూర్, గంగపుత్ర భాస్కర్, నర్సింహా గుప్తా, జగన్నాద్ రెడ్డి, తోట రాజశేఖరరెడ్డి, దయానంద్, పార్శపు శ్రీధర్, శ్రీకాంత్, కుమార్, చిత్రం సాయి, ఆనంద్, ప్రసాద్, ప్రకాష్, వెంకట్ రెడ్డి, ఉమ మహేశ్వర్, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకులను కాంగ్రెస్ సొంత సంస్థల్లా వాడుకుంది..

ఐడీబీఐ వాటాల విక్రయంపై రాహుల్‌కు నిర్మలా కౌంటర్

అక్టోబర్ 30(ప్రజావినికిడి):
ఐడీబీఐ బ్యాంకులో మెజారిటీ వాటా విక్రయించాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సమర్థించారు. ఈ విక్రయంపై కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చేసిన విమర్శలకు ఆమె స్పందించారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు బ్యాంకులపై రాజకీయ ఒత్తిళ్లు తెచ్చి, నిబంధనలకు విరుద్ధంగా రుణాలు ఇప్పించాయని ఆరోపించారు. వాటి ఫలితంగానే ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో భారీగా మొండి బకాయిలు పేరుకుపోయాయని విమర్శించారు.

బ్యాంకులు, ఆర్థిక సంస్థలను కాంగ్రెస్ నేతలు తమ సొంత సంస్థల్లా వాడుకున్నారని నిర్మలా సీతారామన్ ఎక్స్‌లో పేర్కొన్నారు. తమకు నచ్చిన సంస్థలకు రుణాలు ఇవ్వాలని బ్యాంకు ఉద్యోగులపై ఒత్తిడి తెచ్చారని ఆరోపించారు. 1976లో ఇందిరా గాంధీ ప్రభుత్వం.. సంజయ్ గాంధీ వర్గానికి సంబంధమున్న సంస్థకు రుణాల విషయంలో రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గని ఎస్‌బీఐ ఛైర్మన్ ఆర్.కె. తల్వార్‌ను పదవి నుంచి తొలగించిందని గుర్తుచేశారు. మారుతి సంస్థకు రుణాల విషయంలోనూ 'సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా'పై సంజయ్ గాంధీ ఒత్తిడి తెచ్చారని ఆమె ఆరోపించారు.ఐడీబీఐ బ్యాంక్ గతంలో తీవ్ర సమస్యల్లో కూరుకుపోయిందని ఆర్థిక మంత్రి పేర్కొన్నారు. వీడియోకాన్, విన్‌సమ్, ఏబీజీ షిప్‌యార్డ్, కింగ్‌ఫిషర్ వంటి పెద్ద సంస్థలకు ఇచ్చిన రుణాలు మొండి బకాయిలుగా మారి బ్యాంకుకు భారీ నష్టాలు తెచ్చాయని తెలిపారు. ఈ సంస్థలకు కాంగ్రెస్ నేతలతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయని ఆరోపించారు. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం వృత్తిపరమైన నిర్వహణ, జాగ్రత్తతో కూడిన రుణ విధానాలు, రూ.25 వేల కోట్లకు పైగా మూలధన సాయం ద్వారా బ్యాంకును తిరిగి గాడిలో పెట్టిందని చెప్పారు. ఐడీబీఐ పునర్వ్యవస్థీకరణలో అన్ని నిబంధనలను పాటించామని స్పష్టం చేశారు.
2024 ఫిబ్రవరిలో కేంద్రం విడుదల చేసిన భారత ఆర్థిక వ్యవస్థపై శ్వేతపత్రంలో గత ప్రభుత్వాల హయాంలో చోటుచేసుకున్న ఆర్థిక అవకతవకల వివరాలు ఉన్నాయని నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. కాంగ్రెస్ హయాంలో.. పలుకుబడి ఉన్నవారికి ఒక రకంగా, సామాన్యులకు మరో రకంగా బ్యాంకింగ్ సేవలు అందేవని విమర్శించారు. ఈ నెల 14న ఐడీబీఐ బ్యాంకులో 60.72 శాతం వాటాను కెనడాకు చెందిన ఫెయిర్‌ఫాక్స్ ఫైనాన్షియల్ హోల్డింగ్స్‌కు సుమారు రూ.53 వేల కోట్లకు విక్రయించేందుకు కేంద్రం ఆమోదం తెలిపింది. ఇది భారత బ్యాంకింగ్ రంగంలో అతిపెద్ద విదేశీ పెట్టుబడిగా నిలవనుంది. ఈ నిర్ణయాన్ని రాహుల్ గాంధీ విమర్శిస్తూ.. కాంగ్రెస్ ప్రభుత్వాలు బ్యాంకులను ఏర్పాటు చేస్తే, మోదీ ప్రభుత్వం వాటిని విక్రయిస్తోందని వ్యాఖ్యానించారు. ఐడీబీఐ ఉద్యోగులకు అండగా ఉంటానని ఆయన తెలిపారు.

కన్నడిగులకే ఉద్యోగాలు..

కర్ణాటకలో ఐటీ కంపెనీలపై ఒత్తిడికి కరవే పిలుపు

ఐటీ, బీటీ కంపెనీలలో కన్నడిగులకు ఉద్యోగాల కోసం ఉద్యమం

నవంబర్ 1 నుంచి నెల రోజుల పాటు కరవే ఆందోళన

స్థానిక నియామకాలపై కంపెనీల నుంచి వివరాల సేకరణ

కన్నడిగులకు అన్యాయం చేస్తే చర్యలు తప్పవన్న సీఎం శివకుమార్

అక్టోబర్ 30 (ప్రజావినికిడి):
కర్ణాటకలోని ఐటీ, బయోటెక్నాలజీ (బీటీ) కంపెనీలలో కన్నడిగులకు ఉద్యోగావకాశాలు పెంచాలన్న డిమాండ్‌తో కన్నడ అనుకూల సంస్థ 'కర్ణాటక రక్షణ వేదిక' (కరవే) ఉద్యమానికి పిలుపునిచ్చింది. నవంబర్ 1న కర్ణాటక రాజ్యోత్సవం సందర్భంగా ఈ ఆందోళన ప్రారంభించి, నెల రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా కొనసాగించనున్నట్లు ప్రకటించింది.ఈ కార్యక్రమంలో భాగంగా, కరవే పలు బృందాలను ఏర్పాటు చేయనుంది. ఒక్కో బృందంలో 10 మంది నాయకులు, కార్యకర్తలు ఉంటారు. వీరు రాష్ట్రంలోని ఐటీ, బీటీ కంపెనీలను సందర్శించి, యాజమాన్యాలు, హెచ్‌ఆర్ అధికారులతో సమావేశమవుతారు. కంపెనీలో ఎంతమంది కన్నడిగులు పనిచేస్తున్నారు, స్థానికులకు ఉద్యోగాలు ఇచ్చేందుకు ఎలాంటి విధానాలు పాటిస్తున్నారు, అర్హత ఉన్నప్పటికీ కన్నడిగులకు ఎందుకు అవకాశాలు దక్కడం లేదనే అంశాలపై వివరణ కోరుతూ విజ్ఞాపన పత్రాలు సమర్పిస్తారు.
కర్ణాటక భూమి, నీరు, మౌలిక సదుపాయాలను వాడుకుంటున్న కంపెనీలు స్థానికుల ఉద్యోగ ఆకాంక్షలను గౌరవించాలని కరవే స్పష్టం చేసింది. ఐటీ రంగంలో కన్నడిగులు సమర్థులైనప్పటికీ వారికి తగిన అవకాశాలు ఇవ్వడం లేదని, నియామకాల్లో పారదర్శకత పాటించాలని డిమాండ్ చేసింది. ఈ క్రమంలో స్థానిక ఉద్యోగులు, నిరుద్యోగుల నుంచి కూడా ఫిర్యాదులు స్వీకరించనున్నారు.
ఈ అంశంపై కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ కూడా ఇటీవలే స్పందించారు. బెంగళూరులోని ఐటీ కంపెనీలు కావాలనే కన్నడిగులను ఉద్యోగాలకు దూరంగా ఉంచుతున్నాయనే ఫిర్యాదులను ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తోందని అక్టోబర్ 25న ఆయన హెచ్చరించారు. స్థానికులకు అన్యాయం జరుగుతున్నట్లు తేలితే ప్రైవేట్ సంస్థలపై కఠిన చర్యలు తీసుకుంటామని, కన్నడిగుల హక్కులు, ఉద్యోగావకాశాల విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.

సీనియర్ ఐపీఎస్ అధికారి ఎన్. బాలసుబ్రహ్మణ్యం కన్నుమూత

క్యాన్సర్ వ్యాధికి న్యూయార్క్‌లో చికిత్స పొందుతూ మృతి

ఏపీలో పలు కీలక శాఖల్లో సమర్థవంతంగా విధులు నిర్వహించిన బాలసుబ్రహ్మణ్యం

ఆయన మృతిపై పోలీస్, పరిపాలన వర్గాల్లో విషాదం

కొన్ని నెలల క్రితమే ఏపీఎస్‌ఆర్టీసీ ఎండీగా బాధ్యతల నిర్వహణ

అమరావతి, అక్టోబర్ 30(ప్రజావినికిడి):
ఆంధ్రప్రదేశ్ పోలీస్ మరియు పాలనా విభాగాల్లో తీవ్ర విషాదం నెలకొంది. సీనియర్ రిటైర్డ్ ఐపీఎస్ అధికారి, ఏపీఎస్‌ఆర్టీసీ మాజీ వైస్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఎన్. బాలసుబ్రహ్మణ్యం కన్నుమూశారు. గత కొంతకాలంగా క్యాన్సర్‌తో బాధపడుతున్న ఆయన, అమెరికాలోని న్యూయార్క్‌లో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. ఆయన అకాల మరణం పోలీస్ మరియు ప్రభుత్వ శాఖల్లో తీరని లోటును మిగిల్చింది. 1994 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన బాలసుబ్రహ్మణ్యం, ఆంధ్రప్రదేశ్ కేడర్‌లో అత్యంత కీలకమైన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించారు. తన సుదీర్ఘ వృత్తి జీవితంలో రవాణా, సాంకేతిక, శాంతిభద్రతల విభాగాలలో విశేష సేవలందించారు. అనేక సందర్భాల్లో ఐఏఎస్ అధికారులకు సమానమైన హోదాల్లో ఆయన బాధ్యతలు చేపట్టారు. రాష్ట్ర రవాణా శాఖ కమిషనర్‌గా, ఇంటెలిజెన్స్ ఐజీగా, ఈ-ప్రగతి అథారిటీ సీఈఓగా, రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ (ఆర్టీజీఎస్) సీఈఓగా పనిచేసి ఆయన తనదైన ముద్ర వేశారు. ఈ ఏడాది (2026) ఆరంభంలో రాష్ట్ర ప్రభుత్వం ఆయనను ఏపీఎస్‌ఆర్టీసీ వైస్ ఛైర్మన్, ఎండీగా నియమించింది. విధి నిర్వహణలో ఆయన కనబరిచిన నిబద్ధత, పనితీరు అందరి మన్ననలు పొందాయి. బాలసుబ్రహ్మణ్యం మృతి పట్ల ఏపీ పోలీస్ శాఖ, ఆర్టీసీ ఉన్నతాధికారులు, పలువురు ప్రముఖులు మరియు ప్రజాప్రతినిధులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

పేదరికంపై భారత్ గెలుపు..

ప్రపంచ బ్యాంకు ప్రశంసలు



అక్టోబర్ 30(ప్రజావినికిడి):
పేదరిక నిర్మూలనలో ప్రపంచంలోనే అత్యంత వేగంగా పురోగమిస్తున్న దేశాల్లో ఒకటిగా భారత్ నిలిచిందని ప్రపంచ బ్యాంకు వెల్లడించింది. 2011 నుంచి 2023 మధ్య 12 ఏళ్ల కాలంలో దేశంలో సుమారు 496 మిలియన్ల మంది (దాదాపు 50 కోట్లు) ప్రజలు పేదరికం నుంచి బయటపడ్డారని తన తాజా నివేదికలో పేర్కొంది. ఇదే సమయంలో తీవ్ర పేదరికం 27.1 శాతం నుంచి కేవలం 2.6 శాతానికి పడిపోయిందని తెలిపింది.ప్రపంచ బ్యాంకు విడుదల చేసిన 'అక్టోబర్ 2026 ఇండియా పావర్టీ అండ్ ఈక్విటీ బ్రీఫ్' నివేదిక ప్రకారం, రోజుకు 4.20 డాలర్ల (సుమారు రూ. 350) కంటే తక్కువ ఆదాయంతో జీవించే జనాభా 2011లో 57.7 శాతం ఉండగా, 2023 నాటికి అది 16.1 శాతానికి తగ్గింది. తీవ్ర పేదరికానికి సూచికగా భావించే రోజుకు 3 డాలర్ల (సుమారు రూ. 250) ఆదాయ పరిమితి కంటే దిగువన ఉన్న వారి సంఖ్య 27.1 శాతం నుంచి 2.6 శాతానికి పడిపోయింది. దేశంలో వినియోగం పెరగడం, ఉపాధి అవకాశాలు మెరుగుపడటం, ఆహార సబ్సిడీల వంటి ప్రభుత్వ సామాజిక బదిలీ పథకాల వల్లే ఈ అద్భుతమైన ప్రగతి సాధ్యమైందని నివేదిక విశ్లేషించింది.ముఖ్యంగా 2017-2023 మధ్య కాలంలో దేశంలో కొత్తగా 134 మిలియన్ల ఉద్యోగాలు సృష్టించబడ్డాయని, ఇందులో గ్రామీణ ప్రాంత మహిళలు వేతనంతో కూడిన పనుల్లోకి రావడం కీలక పాత్ర పోషించిందని ప్రపంచ బ్యాంకు తెలిపింది. అయితే, కొత్తగా వచ్చిన ఉద్యోగాల్లో చాలా వరకు తక్కువ ఉత్పాదకత ఉన్న రంగాల్లోనే ఉండటంతో, ఉద్యోగుల వాస్తవ వేతనాల్లో పెద్దగా మార్పు కనిపించలేదని పేర్కొంది.పేదరికం గణనీయంగా తగ్గినప్పటికీ, దేశంలో ఆదాయ అసమానతలు ఇప్పటికీ తీవ్రంగానే ఉన్నాయి. అత్యధిక వేతనం పొందే మొదటి 10 శాతం మంది ఉద్యోగుల ఆదాయం, అత్యల్ప వేతనం పొందే చివరి 10 శాతం మంది కంటే 13 రెట్లు ఎక్కువగా ఉంది. అలాగే, పట్టణ ప్రాంతాల్లో పేదరికం 8.6 శాతంగా ఉండగా, గ్రామీణ ప్రాంతాల్లో ఇది 19.3 శాతంగా నమోదైంది. భవిష్యత్తులో పేదరికాన్ని మరింత తగ్గించాలంటే వ్యవసాయేతర రంగాల్లో అధిక ఉత్పాదకత, నాణ్యమైన ఉద్యోగాలను సృష్టించడంపై దృష్టి పెట్టాలని ప్రపంచ బ్యాంకు సూచించింది.

విద్యార్థులకు గూగుల్ గుడ్‌న్యూస్..

జెమినీలో వందలాది ఉచిత పాఠ్యపుస్తకాలు!

అక్టోబర్ 30(ప్రజావినికిడి):
విద్యార్థులకు ఉపయోగపడేలా గూగుల్ కీలక ప్రకటన చేసింది. తన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ప్లాట్‌ఫామ్ జెమినీ నోట్‌బుక్‌లో వందలాది పాఠ్యపుస్తకాలను ఉచితంగా అందుబాటులోకి తెచ్చింది. అమెరికా, భారత్‌లోని ప్రచురణ సంస్థలు, విద్యా వనరుల నుంచి ఈ పుస్తకాలను తీసుకొచ్చింది. ఓపెన్‌స్టాక్స్, ఓపెన్ టెక్స్ట్‌బుక్ లైబ్రరీ, ఎస్.చాంద్ పబ్లిషింగ్ సంస్థలకు చెందిన పుస్తకాలు ఇందులో ఉన్నాయి. ఈ పుస్తకాల ఆధారంగా విద్యార్థులు తమ సందేహాలకు సమాధానాలు పొందవచ్చు. ప్రత్యేకత ఏమిటంటే.. జెమినీ ఇచ్చే సమాధానాలకు పాఠ్యపుస్తకాల్లోని సంబంధిత సమాచారాన్ని ఆధారంగా చూపిస్తుంది. సమాధానాల్లోనే మూల పుస్తకాలకు సంబంధించిన సూచనలు, లింకులు ఉంటాయి. దీంతో ఏ సమాచారం ఏ పుస్తకం నుంచి తీసుకుందో విద్యార్థులు సులభంగా తెలుసుకోవచ్చు.పుస్తకాల్లోని అంశాలతో వ్యక్తిగత అవసరాలకు అనుగుణంగా స్టడీ గైడ్లు, ప్రాక్టీస్ క్విజ్‌లు, ఫ్లాష్‌కార్డులు కూడా రూపొందించుకోవచ్చు. పరీక్షలకు సిద్ధమయ్యే సమయంలో పాఠ్యాంశాలను పునశ్చరణ చేసుకోవడానికి ఇవి ఉపయోగపడతాయి. విద్యార్థులు తమకు అర్థంకాని అంశాలపై ప్రశ్నలు అడిగి, పుస్తకంలోని సమాచారం ఆధారంగా వివరణలు పొందవచ్చు.

ఎలా ఉపయోగించుకోవాలంటే..
ముందుగా జెమినీ నోట్‌బుక్‌లోకి వెళ్లి కొత్త నోట్‌బుక్‌ను తెరవాలి. అందులో 'యాడ్ సోర్సెస్' అనే ఆప్షన్‌ను ఎంచుకోవాలి. అనంతరం 'టెక్స్ట్‌బుక్స్'పై క్లిక్ చేస్తే అందుబాటులో ఉన్న పుస్తకాల జాబితా కనిపిస్తుంది. అందులో కావాల్సిన పుస్తకాన్ని ఎంచుకుని నోట్‌బుక్‌కు జత చేసుకోవచ్చు. ఈ సదుపాయాన్ని ఉపయోగించుకోవడానికి అదనంగా చెల్లించాల్సిన అవసరం లేదని గూగుల్ తెలిపింది. విద్యార్థులు విశ్వసనీయమైన పాఠ్యాంశాల ఆధారంగా ఏఐ సాయంతో నేర్చుకునేలా చేయడమే ఈ నిర్ణయం వెనుక ఉద్దేశమని గూగుల్ పేర్కొంది. గత నెల ప్రారంభించిన 'ఎక్స్‌పర్ట్ ఇంటెలిజెన్స్' కార్యక్రమంలో భాగంగా ఈ సదుపాయాన్ని విస్తరిస్తోంది.

కూటమి ధీమా...వైసీపీలో ఆశ!

అమరావతి, అక్టోబర్ 30 (ప్రజావినికిడి):
స్థానిక సంస్థల ఎన్నికల్లో తొలి విడతలో భాగంగా కార్పోరేషన్లు, మునిసిపాలిటీలు, నగర పంచాయతీలకు పోలింగ్ కి కౌంట్ డౌన్ స్టార్ట్ అయింది. నవంబర్ 1న పోలింగ్ జరగనుంది. ఇదిలా ఉంటే ఏపీలో 13 కార్పోరేషన్లకు ఎన్నికలు జరుగుతున్నాయి. ఇందులో నూటికి నూరు తాము గెలుస్తామని కూటమి పూర్తి ధీమా వ్యక్తం చేస్తోంది. వైసీపీ అయితే తాము గట్టి పోటీ ఇస్తామని కూటమిలో అనైక్యత ఏమైనా ఉంటే తమకు ఎంతో కొంత అనుకూలిస్తుందని ఆశలు పెంచుకుంటోంది.
ఏపీలో అతి పెద్ద కార్పొరేషన్ గా ఉత్తరాంధ్రాలో విశాఖ ఉంది. ఇక్కడ మొత్తం 120 వార్డులు ఉన్నాయి. వైసీపీ నుంచి వరుదు కళ్యాణి టీడీపీ నుంచి ముక్కా శ్రావణి మేయర్ అభ్యర్థులుగా పోటీ చేస్తున్నారు. వైసీపీ అయితే బలమైన పోటీ ఇస్తామని అంటోంది. కూటమిలోని మూడు పార్టీలు కలసికట్టుగా రంగంలో ఉన్నందువల్ల నల్లేరు మీద నడకగా తమకు ఈ ఎన్నికలు ఉంటాయని టీడీపీ అంచనా వేస్తోంది. తమ విజయం ఖయామని కూటమి నేతలు చెబుతున్నారు. విజయనగరంలో చూస్తే వైసీపీ నుంచి మాజీ ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి కుమార్తె కోలగట్ల శ్రావణి పోటీలో ఉన్నారు. ఆమె గత అయిదేళ్లుగా డిప్యూటీ మేయర్ గా పనిచేశారు కాబట్టి ఆ అనుభవం కలసి వస్తుందని భావిస్తున్నారు. ఇక టీడీపీ నుంచి అవనాపు భార్గవి పోటీలో ఉన్నారు. ఇక్కడ కూడా కూటమి బలమే టీడీపీకి గట్టి అండగా ఉండబోతోంది. అయితే వైసీపీ ఏమైనా చాన్స్ ఉంటుందేమో అని చూస్తోంది అంటున్నారు.

ఇక మిగిలిన చోట్ల మేయర్ సీట్లు చూస్తే విజయవాడలో వంగవీటి రాధా క్రిష్ణ జనసేన తరఫున బరిలో ఉన్నారు. ఆయనకు పోటీగా వైసీపీ మాజీ మేయర్ రాయన భాగ్యలక్ష్మిని నిలిపింది. ఇక్కడ ఇండిపెండెంట్ గా ఏబీ వెంకటేశ్వరరావు పోటీలో ఉన్నారు. కానీ జనసేన టీడీపీ కట్టుగా నిలిచి ఉన్నాయి. దాంతో పాటు వంగవీటి బ్రాండ్ కూడా ఈ ఎన్నికల్లో కీలకం అవుతుందని అంటున్నారు. అలా జనసేన ఖాతాలో తొలి మేయర్ సీటు పడుతుందని అంటున్నారు. గుంటూరు, మచిలీపట్నం, ఒంగోలు లలో కూటమికి నల్లేరు మీద నడక అనే అంటున్నారు. అయితే నెల్లూరులో మాత్రం ఆనం విజయ్ కుమార్ రెడ్డిన్ వైసీపీ మేయర్ అభ్యర్థిగా నిలబెట్టింది. దాంతో ఇక్కడ కొంత పోటీ ఉండే చాన్స్ ఉంది అంటున్నారు.
ఇక చిత్తూరు, తిరుపతి, కడప, అనంతపురం మేయర్ సీట్లకు ఎన్నికలు అయితే ఏకపక్షంగానే సాగనున్నాయని అంటున్నారు. ఇందులో అనేక చోట్ల నామినేషన్లు పూర్తిగా వైసీపీ వేయలేదు అని అంటున్నారు. దాంతో ముందే కూటమికి విజయం ఖాయం అయింది అని అంటున్నారు. కడపలో తొలిసారి కూటమి మేయర్ ని చూడబోతున్నారు అని అంటున్నారు. ఇక అనంతపురం కార్పోరేషన్ మీద కమలం జెండా ఎగరనుంది అని అంటున్నారు. మొత్తం మీద చూస్తే మేయర్ ఎన్నికల్లో కూటమి నూరు శాతం స్ట్రైక్ రేట్ సాధిస్తుందని ధీమాగా ఉంది. అలాగే 87 మునిసిపాలిటీలలో కూడా కూటమి పార్టీల జెండా ఎగురుతుందని అంటున్నారు. అయితే వైసీపీ తాము ధీటైన పోటీ ఇస్తామని కొన్ని చోట్ల ఫలితాలు అనూహ్యంగా ఉండబోతాయని సంకేతాలు ఇస్తోంది. చూడాలి మరి ఏమి జరుగుతుందో



ఓటు హక్కుకోసం పోరాటం

అక్టోబర్ 30,(ప్రజావినికిడి):

ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాల భవిష్యత్తును నిర్ణయించేది ప్రజలే. ఆ నిర్ణయానికి ప్రాతిపదిక ఓటు హక్కు. కానీ ఓటు వేయాలనే ఆసక్తి ఉన్నా, ఓటర్ల జాబితాలో పేరే లేకపోతే పౌరుడి గొంతుకకు విలువ ఉండదు. ఓటు హక్కు కల్పించడంతో పాటు, దాన్ని వినియోగించుకునే అవకాశం ప్రతి అర్హుడికీ ఉందని నిర్ధారించడం కూడా ఎన్నికల వ్యవస్థ బాధ్యత. ఇప్పుడు దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై తలెత్తుతున్న వివాదాల నేపథ్యంలో ఓటు హక్కు పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలో నవంబర్ 1న న్యూఢిల్లీలో 'ఓట్ బచావో-దేశ్ బచావో' ర్యాలీ నిర్వహిస్తోంది. ఓటర్ల జాబితాలను ఎప్పటికప్పుడు సరిచేయడం అవసరమే. మరణించినవారి పేర్లు కొనసాగకుండా చూడటం, నకిలీ ఓట్ల నమోదులు, ఒకటి కంటే ఎక్కువ చోట్ల నమోదైన పేర్లను తొలగించడం ఎన్నికల సంఘం విధుల్లో భాగం.అయితే ఈ క్రమంలో అర్హులైన ఓటర్ల పేర్లు తొలగిపోకుండా చూడటం అంతకంటే ముఖ్యమైన బాధ్యత. సవరణ ప్రక్రియలో తప్పులు జరిగితే వాటి ప్రభావం కేవలం ఒక వ్యక్తిపైనే కాదు. ఎన్నికల్లో ప్రజల భాగస్వామ్యంపైనా పడుతుంది. అందువల్ల ఎస్ఐఆర్ ప్రక్రియను ఎన్ని పేర్లు తొలగించారన్న లెక్కతో కాకుండా, అనర్హుల పేర్లను సరిగా గుర్తించడంతోపాటు అర్హులందరి ఓటు హక్కును ఎంత సమర్థంగా కాపాడారన్న ప్రమాణంతో అంచనా వేయాలి. దేశవ్యాప్తంగా 30 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు సంబంధించిన గణాంకాల ప్రకారం, వివిధ దశల్లో ముసాయిదా ఓటర్ల జాబితాల నుంచి సుమారు 13.37 కోట్ల పేర్లు తొలగించబడ్డాయి. పెద్ద సంఖ్యలో పేర్లు తొలగించినప్పుడు ప్రతి కేసునూ ఎలా పరిశీలించారు? ఓటరు అందుబాటులో లేకపోతే మరోసారి సంప్రదించారా? అభ్యంతరాలు తెలిపేందుకు తగిన సమయం ఇచ్చారా? పేర్లు తొలగించిన కారణాలను వ్యక్తిగతంగా తెలియజేశారా?అనే ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉంది. గణాంకాలు వెల్లడించడం మాత్రమే కాకుండా, వాటి వెనుక ఉన్న ప్రక్రియను కూడా ఎన్నికల సంఘం ప్రజలకు వివరిస్తేనే ప్రజలకు భరోసా కలుగుతుంది. అయితే దురదృష్టవశాత్తు సర్ ప్రక్రియలో పారదర్శకతో లోపిస్తుంది. మరోవైపు 2002 ఓటర్ల జాబితాతో మ్యాపింగ్ చేయాలనే నిబంధనతో ప్రజల్లో అనుమానాలు రెట్టింపవుతున్నాయి.తెలంగాణలో ఓటర్ల జాబితాల సవరణపై పలు సందేహాలున్నాయి. రాష్ట్రంలో గతంలో 3,38,26,448 మంది ఓటర్లు ఉండగా, 2,64,87,213 మంది నుంచి గణన పత్రాలు అందినట్లు ఎన్నికల సంఘం పేర్కొనడంతో 73,39,235 మంది పేర్లు ముసాయిదా జాబితాలో లేకుండా పోయినట్లు లెక్కలు సూచిస్తున్నాయి.మరోవైపు సుమారు 92,87,577 మందికి అనుమానాస్పదం కింద నోటీసులు జారీ చేశారు. వీరందరి కోసం తెలంగాణ కాంగ్రెస్ క్షేత్రస్థాయిలో బిఎల్ఏలను నియమించి వారి ఓటు హక్కును పరిరక్షించేందుకు కృషి చేసింది. దేశ వ్యాప్తంగా తొలగించిన ఓట్ల గణాంకాలను పరిశీలిస్తే కీలకమైన అంశాలు వెలుగుచూస్తున్నాయి.గత జాబితాతో వివరాలు సరిపోలకపోవడం ప్రస్తుత ఓటరు అర్హత లేదని నిర్ధారించడానికి సరిపోతుందా? దశాబ్దాలుగా ఓటు వేస్తున్న వ్యక్తి పూర్వీకుల వివరాలు లేదా పాత చిరునామాను సమర్పించలేకపోతే అతడి హక్కు ప్రశ్నార్థకమవ్వాలా? సందేహాలపై ఎన్నికల సంఘం బాధ్యతాయుతంగా వ్యవహరించడం లేదు. చిరునామా మారినవారు, తాత్కాలికంగా అందుబాటులో లేనివారు, పత్రాలు సేకరించలేని వృద్ధులు, పేదలు ఎదుర్కొనే ఇబ్బందులను కూడా అధికారులు పరిగణనలోకి తీసుకోవాలి. తెలంగాణ ప్రభుత్వం ఫ్యామిలీ రిజిస్టర్ సర్టిఫికేట్ (ఎఫ్ఆర్‌సి)ను ప్రత్యామ్నాయ ఆధారంగా పరిగణించాలని కోరినా ఎన్నికల సంఘం పట్టించుకోలేదు. గతంలో ఓటు వేసిన వారి పేర్లు కూడా తొలగించారు. ఇప్పుడు వారు ఓటర్ల జాబితాలో పేరు నమోదు కోసం వివరాలు సమర్పించాల్సి రావడం ఎంత వరకు సమంజసం.ఓటర్ల నమోదు, తొలగింపు ప్రక్రియలో ఉపయోగించే ఫారం-6, ఫారం-7, ఫారం-8ల విషయంలోనూ స్పష్టత కరువైంది. కొత్త ఓటరు నమోదుకు ఫారం- 6, పేరు తొలగింపుకు సంబంధించిన అభ్యర్థనకు ఫారం-7, వివరాల సవరణలకు ఫారం-8 ఉపయోగిస్తారు. వీటిలో డిక్లరేషన్‌కు సంబంధించిన మార్పులు, వాటి చట్టపరమైన ఆధారాలు, ఎన్నికల సంఘం వెబ్‌సైట్‌లో చోటుచేసుకున్న మార్పులపై సందేహాలు వ్యక్తమయ్యాయి. ప్రధానంగా ఫారం-6లో డిక్లరేషన్‌కు సంబంధించి నిబంధనలకు వ్యతిరేకంగా మార్పులు చేశారనే అంశంపై పెద్ద దుమారమే రేగింది. ఫారం-6లో మార్పుకు తాము అనుమతివ్వలేదని ఇప్పటికే ఉన్నత న్యాయస్థానం కూడా వ్యాఖ్యానించింది.

మూసీ ప్రక్షాళనకు మేము వ్యతిరేకం కాదు: రాంచందర్ రావు

అక్టోబర్ 30(ప్రజావినికిడి):



మూసీ నది ప్రక్షాళన ప్రాజెక్టును బీజేపీ అడ్డుకుంటోందని కాంగ్రెస్ పార్టీ తప్పుడు ప్రచారం చేస్తోందని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రాంచందర్ రావు మండిపడ్డారు. మూసీ ప్రక్షాళనను తమ పార్టీ వ్యతిరేకించడం లేదని, అయితే 'గాంధీ సరోవరం' పేరిట పేదల ఇళ్లను కూల్చివేయడాన్ని మాత్రం తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని ఆయన స్పష్టం చేశారు.నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఈరోజు ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రాంచందర్ రావు మాట్లాడారు. పేదల ఇళ్లకు ఎలాంటి నష్టం జరగకుండా మూసీని శుభ్రపరిచే ప్రణాళికలు ప్రభుత్వం సిద్ధం చేయాలని సూచించారు. ఉద్యోగులకు జీతాలు, పెన్షన్లు ఇవ్వడానికి నిధులు లేవని చెబుతున్న ప్రభుత్వం, మూసీ ప్రక్షాళన పేరుతో వేల కోట్లు ఖర్చు చేయడానికి సిద్ధమవ్వడం విచిత్రంగా ఉందన్నారు. ఈ ప్రాజెక్టుకు ఇంత పెద్ద మొత్తంలో నిధులు ఎక్కడి నుంచి వస్తున్నాయని ఆయన ప్రశ్నించారు.ఢిల్లీలో విపక్షాలు తలపెట్టిన 'మాక్ పార్లమెంట్'పైనా రాంచందర్ రావు తీవ్ర విమర్శలు చేశారు. కాంగ్రెస్ నేతలు ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని మండిపడ్డారు. గతంలో యూపీఏ హయాంలో ములాయం సింగ్ యాదవ్ నాయకత్వంలో మాక్ పార్లమెంట్ నిర్వహిస్తే, దాన్ని ఎందుకు నిర్వహిస్తున్నారని సోనియా గాంధీ ప్రశ్నించిన విషయాన్ని గుర్తు చేశారు. పార్లమెంట్‌ను ప్రజాస్వామ్య దేవాలయంగా అభివర్ణించిన కాంగ్రెస్ నేత, మాజీ స్పీకర్ మీరా కుమార్ విషయాన్ని ప్రస్తావిస్తూ... ఇప్పుడు అదే కాంగ్రెస్ నేతలు రాజకీయ స్వలాభం కోసం ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని విమర్శించారు.

నెతన్యాహు నెగ్గితే భద్రత ఎవరికి?

అక్టోబర్ 30,(ప్రజావినికిడి):

అక్టోబర్ 27న ఇజ్రాయెల్‌లో జరిగిన ఎన్నికల్లో ప్రస్తుత ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ప్రధాన కేంద్ర బిందువుగా మారారు. ఇజ్రాయెల్ ఏర్పడిన 78 సంవత్సరాల చరిత్రలో దాదాపు రెండు దశాబ్దాల పాటు అధికారంలో కొనసాగిన నెతన్యాహుకు ఈ ఎన్నికలు అతిపెద్ద పరీక్షగా నిలిచాయి. 2021లో అధికారం కోల్పోయినప్పటికీ, 2022లో విజయం సాధించి తీవ్ర భావజాలం వైపు మొగ్గు చూపారు. అల్ట్రా ఆర్థడాక్స్ పార్టీల మద్దతుతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. ప్రభుత్వ నిర్ణయాలపై సుప్రీంకోర్టు నియంత్రణ తగ్గించగలిగారు. 2023 అక్టోబర్ 7న ఇజ్రాయెల్‌పై హమాస్ దాడి చేయగా, గాజాలో నెతన్యాహు నాయకత్వంలో భీకర సమరం సాగింది. ఇదో మారణహోమం అన్న తీవ్ర విమర్శలు వచ్చాయి.మరోవైపు ప్రతిపక్ష పార్టీలు అక్టోబర్ 7న హమాస్ దాడి ఇజ్రాయెల్ భద్రతా వైఫల్యమేనని, దీనికి నెతన్యాహును బాధ్యుడిగా నిలబెడతామని, నిరంతరం సాగుతున్న యుద్ధాలకు ముగింపు పలుకుతామని వెల్లడించాయి. ఈ ఎన్నికలు నెతన్యాహును అధికారం లోంచి తొలగించడానికి విపక్షాలకు ఒక అవకాశంగా మారాయి. అయితే ఈ ఎన్నికల ఫలితాలు మిశ్రమ సంకేతాలను అందించాయి. బుధవారం సాయంత్రం పోలైన ఓట్లలో 86 శాతం లెక్కించగా 120 స్థానాలున్న ఇజ్రాయెల్ పార్లమెంట్ (క్నెసెట్)లో నెతన్యాహు నేతృత్వం లోని లికుడ్ కూటమికి 54 సీట్లు, ప్రత్యర్థి ఐజెన్‌కాట్ నేతృత్వం లోని కూటమికి 47 సీట్లు వచ్చే అవకాశం కనిపించింది. అరబ్ పార్టీలు కూడా 19 సీట్ల వరకు సాధించే అవకాశం ఉంది.ప్రతిపక్ష పార్టీలు అన్నీ కలిపి 67 స్థానాలను సాధించే దిశగా ఉన్నప్పటికీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం అంత సులభం కాదు.ఎందుకంటే అరబ్ పార్టీల మద్దతును స్వీకరించడానికి కొన్ని యూదు పార్టీలు వ్యతిరేకిస్తున్నాయి. ప్రభుత్వం ఏర్పాటుకు సంబంధించిన కూటమి చర్చలను విశాల దృక్పథంతో, ముందస్తు అభిప్రాయాలు లేకుండా జరపాలని ఇజ్రాయెల్ అధ్యక్షుడు ఐజాక్ హెర్జాగ్ విజ్ఞప్తి చేసినా రాజకీయ పార్టీల మధ్య నమ్మకం లోపించింది. చివరి

ఫలితాల తరువాత సీట్ల పంపకం కొనసాగితే స్థిరమైన ప్రభుత్వం ఏర్పాటుకు రానున్న కొన్ని రోజుల వరకు పార్టీల మధ్య తీవ్ర చర్చలు, సంప్రదింపులు, ఒప్పందాల ప్రయత్నాలు జరుగుతాయి. అంతవరకు ప్రస్తుత ప్రధాన మంత్రి నెతన్యాహుయే తాత్కాలిక ప్రధాన మంత్రిగా కొనసాగుతారు. ఈ పరిస్థితి ఆయనకు అనుకూలంగా ఉంటుందని భావిస్తున్నారు. వాస్తవానికి ఈ ఎన్నికలు ప్రధానంగా నెతన్యాహుపై ప్రజల అభిప్రాయాన్ని వ్యక్తం చేసే ఒక రిఫరెండమ్ లాంటిది.ఒకప్పుడు ఇజ్రాయెల్‌లో బలమైన వామపక్ష ఉద్యమం ఉండేది. కానీ నేడు అక్కడి రాజకీయాలు ప్రధానంగా మతపరమైన జియోనిజం, దాని వివిధ రూపాల ఆధిపత్యంలో ఉన్నాయి. నెతన్యాహును వ్యతిరేకించే కూటమి కూడా అరబ్ రాజకీయ పార్టీలతో కలిసి ప్రభుత్వం ఏర్పాటు చేయబోమని హామీ ఇవ్వడం గమనార్హం. నెతన్యాహు తన ప్రభుత్వానికి వ్యతిరేకంగా వేసే ఓటును ఇజ్రాయెల్ శత్రువులకు మద్దతుగా చిత్రీకరించడం ద్వారా ప్రతిపక్షాన్ని ఇరకాటంలో పడేశారు. ఇజ్రాయెల్‌ను రక్షించడానికి తన యుద్ధాలు ధైర్యవంతమైన, తప్పనిసరి చర్యలని నెతన్యాహు చెప్పుకొచ్చారు. ఇజ్రాయెల్ భద్రతపై ప్రజల్లో ఉన్న ఆందోళనలను తన రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగించుకున్నారు. ఇజ్రాయెల్ జనాభాలో దాదాపు 20 శాతంగా ఉన్న అరబ్ ప్రజలు అరబ్ రాజకీయ పార్టీల వెనుక ఏకమవ్వడం ఈ విభజనను ప్రతిబింబిస్తోంది.ఇజ్రాయెల్ యూదులు, అరబ్ పౌరుల మధ్య రాజకీయ విభేదాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఇజ్రాయెల్‌లో రాజకీయ పరిస్థితులు పూర్తిగా మారిపోయాయన్న వాస్తవాన్ని ఈ ఎన్నికలు స్పష్టం చేస్తున్నాయి. బెంజమిన్ నెతన్యాహు అధికారంలో కొనసాగుతున్నంత కాలం ఇరాన్‌పై యుద్ధమే కాదు, ఇజ్రాయెల్‌కే కాకుండా మొత్తం మధ్య ప్రాచ్య ప్రాంతానికే నష్టం కలగక తప్పదు. ట్రంప్ కూడా నెతన్యాహుకు మద్దతు తెలుపుతూ ఇరాన్‌పై మొదలు పెట్టిన సైనిక చర్యను చివరివరకు కొనసాగించాలనే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. మధ్యంతర ఎన్నికల్లో ట్రంప్ తన సవాళ్లను అధిగమించి తన రాజకీయ స్థితిని నిలబెట్టుకుంటే పశ్చిమాసియా మరోసారి భగ్గుమనక తప్పదు. అయినాసరే ప్రభుత్వ పాలనలో అరబ్ పార్టీల భాగస్వామ్యాన్ని అన్ని వర్గాలు విస్తృతంగా ఆమోదించినప్పుడే నెతన్యాహు ప్రభుత్వానికి స్వస్తి పలకడం జరుగుతుంది.అరబ్ పార్టీలు కీలకంగా మారితే వాటితో కలిసి పనిచేయడానికి నెతన్యాహు వ్యతిరేక కూటమి అంగీకరిస్తుందా అనేది అసలు ప్రశ్న.ఈ ఎన్నికల ఫలితాల నుంచి ప్రతిపక్ష పార్టీలు పాఠం నేర్చుకుని అరబ్ పార్టీలతో కలిసి విస్తృత కూటమిని ఏర్పాటు చేయాలి. ప్రభుత్వం జవాబుదారీతనంతో పనిచేసేలా చూడాలి. నెతన్యాహు నియంత్రణ లోని సైనిక చర్యలను తిరిగి పరిశీలించాలి. అలాగే ప్రపంచ దేశాలతో ఇజ్రాయెల్ సంబంధాలను తిరిగి మెరుగపరిచే ప్రయత్నాలు సాగించాలి. ఇదే సమయంలో మధ్యప్రాచ్య ప్రాంతంలో పరిస్థితులు కూడా మారుతున్నాయి. సోమవారం టెహ్రాన్‌లో ఇరాన్ నాయకులు, సౌదీ అరేబియా, టర్కీ, పాకిస్థాన్ లకు చెందిన ఉన్నత స్థాయి ప్రతినిధులతో సమావేశం జరిగింది. ఇజ్రాయెల్, అమెరికా కారణంగా తాము ఎదుర్కొంటున్న సంఘర్షణలకు దౌత్యపరమైన పరిష్కారం కనుగొనాలనే వారి ప్రయత్నం కనిపించింది. తమ మధ్య విభేదాలు ఉన్నప్పటికీ, చర్చల ద్వారా సమస్యను పరిష్కరించుకోవాలని నిర్ణయించారు. ఈ పరిణామాలు ఇజ్రాయెల్ రాజకీయాలపై ఎలాంటి ప్రభావం చూపిస్తాయో పరిశీలించాల్సిందే.

విశ్వవిద్యాలయాల్లో ప్రజాస్వామ్యం నిషేధమా?

అక్టోబర్ 30(ప్రజావినికిడి):

వందేళ్లకుపైగా చరిత్ర ఉన్న సుమారు 24వేల మంది విద్యార్థులకు పైగా చదువుకుంటున్న ఢిల్లీలోని ప్రముఖ కేంద్రీయ విశ్వవిద్యాలయం జామియా మిలియా ఇస్లామియా గత కొంత కాలంగా ఒక యుద్ధభూమిని తలపింప చేస్తుంది. క్యాంపస్‌లోకి ప్రవేశించే ప్రధాన గేట్లను కొన్నిటిని వెల్డింగ్‌చేసి, అడ్డంగా రేకులు, గోడలు మరీ కట్టి యాజమాన్యం మూసి వేసింది. దగ్గరిలోని మెట్రో స్టేషన్‌లో, క్యాంపస్ బయట దాదాపు వెయ్యి నుండి రెండువేల మందికిపైగా పోలీసు, పారా మిలిటరీ, ఐటిబిపి బలగాలు విద్యార్థులను వారు చదువుకుంటున్న విద్యాలయంలోకి అడుగుపెట్టకుండా, లోన ఉన్నవారు బయటకు పోకుండా అడ్డుకుంటున్నారు. చుట్టూ రోడ్లపై బ్యారికేడ్లు అడ్డంగా పెట్టారు. క్యాంపస్‌లో ఆస్తులకు, శాంతిభద్రతలకు, అకడమిక్ విధులకు భంగం కలుగజేస్తున్నారని విద్యార్థులపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని యాజమాన్యం బెదిరిస్తూ ఉంది. 163 సెక్షన్ జామియా యూనివర్శిటీ పరిసరాల్లో విధించారు. ఆ ప్రాంతం ఒక పోలీసు క్యాంపులా వుంది.అక్టోబర్ 12వ తేదీ నుండి విద్యార్థులు తమ డిమాండ్ల సాధనకోసం నిరాహార దీక్ష చేస్తున్నారు. నేటికి 19వ రోజుకు చేరుకున్నది ఈ దీక్ష. అక్టోబర్ 17 తెల్లవారుజామున, క్యాంపస్ సెక్యూరిటీ, పోలీసులు కలిసి ఆ ప్రాంతంలో లైట్లు ఆపేసి, నిరాహార దీక్ష చేస్తున్న విద్యార్థుల్ని బయటకు లాక్కు వచ్చి కిందపడేసి కొట్టారు. మహిళా విద్యార్థినులను అనుచితంగా తాకారు. కొందరిని అరెస్టు చేశారు. మరో పక్క సంప్రదింపులు అంటూ ఒత్తిడిచేసి, ఆ తెల్లవారుజామున ఓ ఇద్దరు విద్యార్థులతో ఒక ఒప్పందంపై సంతకాలు పెట్టించి, విద్యార్థులు నిరసన ముగించారని, యాజమాన్యం ప్రకటించింది. కాగా ఇది ఒక కుటిల చర్య, విద్యార్థులను హడావిడి, గందరగోళ పెట్టి, ఒత్తిడిచేసి ఇద్దరితో సంతకాలు చేయించారు అని అంటూ, ఈ ఒప్పందాన్ని మిగిలిన వాళ్ళు తిరస్కరించారు. కొందరు దీక్ష విరమించినా, ఎబిన్ బాసిల్, రెహాన్ ఖాన్ మొదలైనవారు కొనసాగిస్తున్నారు. వీరికి జతగా కొత్తగా మరికొందరు కూడా దీక్షలో చేరారు.ఇప్పుడు లైబ్రరీలను, హాస్టళ్లను, చివరికి మరుగుదొడ్లను సైతం మూసివేశారు. విద్యార్థులను ఎలాగైనా క్యాంపస్‌నుండి ఖాళీ చేయించడం కోసం విద్యుత్తు, మంచినీటి సౌకర్యాన్ని రద్దు చేశారు. క్యాంటిన్, మెస్‌లను కూడా మూసివేశారు. లోపల ఉన్న విద్యార్థులకు బయటినుంచి ఎవరైనా, నీరు ఆహారం పంపడానికి ప్రయత్నించినా లేదా దీక్షలో ఉన్న విద్యార్థులకు చేయాల్సిన వైద్య పరీక్షలను అందించే ప్రయత్నం చేసినా అడ్డుకుంటున్నారు. ఇలాంటి పరిస్థితుల మధ్య యూనివర్శిటీలో ఆవరించిన ఆ చిమ్మచీకటిలో, అర్ధరాత్రి సమయాల్లో కూడా విద్యార్థులు, ముఖ్యంగా అమ్మాయిలు తమ నిరసన కొనసాగిస్తూనే ఉన్నారు. ఇప్పుడు విద్యార్థులు చేస్తున్న ఈ నిరాహార దీక్షలకు, ఆందోళనలకు ఎంతో పూర్వ చరిత్ర ఉంది.జామియా మిలియా ఇస్లామియాలో 2005లో చివరి ఎన్నికలు జరిగాయి. 2006 మార్చిలో ఎంపికైన బాడీని రద్దు చేశారు. యాజమాన్యం డిపార్ట్మెంటల్ సబ్జెక్ట్ అసోసియేషన్లు, క్లాస్ రెప్రజెంటేటీవ్‌ల ద్వారా విద్యార్థుల సమస్యలు ఏమైనా ఉంటే వాటిని పరిష్కారం

చేసుకునేందుకు అడగాలని నిర్దేశించడం మొదలుపెట్టింది. ఢిల్లీ యూనివర్శిటీలో, జెఎన్‌యులో ఎన్నికలు జరుగుతుండగా మా కాలేజీలో ఎందుకు ఎన్నికల నిషేధించారని విద్యార్థులు ప్రశ్నిస్తున్నారు. జామియా మిలియా ఇస్లామియా స్టూడెంట్ యూనియన్ (జెఎంఐఎస్‌యు) పునరుద్ధరించాలి. 2026-27 ఎన్నికల షెడ్యూల్ తక్షణమే ప్రకటించాలి. కొత్త యూనియన్ కాన్స్టిట్యూషన్ ఖచ్చితమైన సమయ పరిధిలో ఏర్పాటు చేసి, ఆ వెను వెంటనే, 15 రోజుల్లో ఎన్నికలు నిర్వహించాలి.నిరసనలో పాల్గొన్న విద్యార్థులపై విధించిన సస్పెన్షన్, రెస్టిగేషన్లు, షోకాజ్ నోటీసులు ఉపసంహరించాలి అనే ఈ ప్రధాన డిమాండ్లతోపాటు, హాస్టల్‌లో తాగునీరు, మెస్, మరుగుదొడ్లు వంటి సౌకర్యాలు మెరుగుపరచాలని, లైబ్రరీ, ఫీజులు, అడ్మిషన్లు భద్రత వంటి అంశాలలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని వారు అడుగుతున్న మరి కొన్ని డిమాండ్లు. బ్రిటిష్ వారు మన దేశాన్ని పరిపాలిస్తున్న కాలంలో, 1920 అక్టోబర్ 29 న ఉత్తరప్రదేశ్‌లోని అలీఘడ్‌లో జాతీయవాద ముస్లిం నాయకులు దీనిని స్థాపించారు. బ్రిటిష్ విద్యా వ్యవస్థకు వ్యతిరేకంగా, స్వతంత్ర, జాతీయ భావాలతో, ఆధునిక విలువలతో పనిచేసే విద్యా సంస్థగా తీర్చిదిద్దేందుకు, జామియా మిలియా విద్యా సంస్థలను వారు ఏర్పాటు చేశారు. 1925లో అలీఘడ్ నుంచి ఈ యూనివర్శిటీ ఢిల్లీ కరోల్ బాగ్‌కు, ఆ తరువాత కొంతకాలానికి ప్రస్తుతం ఉన్న ఓఖ్లా, జామియా నగర్ క్యాంపస్‌కి మారింది. దేశంలో ప్రథమ స్థానాల్లో ఉండే యూనివర్శిటీలలో ఒకటిగా ఎంతో గుర్తింపు పొందింది. జాతీయ సమైక్యత, సెక్యులర్ విద్య, ముస్లిం మైనారిటీలకు ప్రాధాన్యత, మహిళా విద్యార్థులకు మరిన్ని ఎక్కువ అవకాశాలు కల్పించడం వంటి విలువల్ని అది మొదటి నుండి పాటిస్తూ వచ్చింది. రవీంద్రనాథ్ ఠాగూర్ ఈ యూనివర్శిటీని 'భారతదేశంలోని అత్యంత ప్రగతిశీల విద్యా సంస్థలలో ఒకటి' అని ప్రశంసించాడు. ఒక దశలో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఈ సంస్థను బతికించడం కోసం జామియా విద్యాసంస్థ నడవాలి. డబ్బు సమస్య ఉంటే నేను భిక్ష పాత్ర పట్టుకుని తిరుగుతాను' అని మహాత్మా గాంధీ అన్నారని చెబుతారు. గాంధీజీ ఎప్పుడూ చెబుతూ ఉండే నయీ తాలీం 'పద్ధతుల్ని ప్రయోగాత్మకంగా జామియాలో అమలు చేశారు. అంతటా ఎంతో హింస చెలరేగిన, దేశ విభజన జరిగిన కాలంలో కూడా జామియా క్యాంపస్‌ను 'శాంతి ఒయాసిస్సు' అని గాంధీజీ అన్నారు. భారత మాజీ రాష్ట్రపతి జాకీర్ హుస్సేన్ జామియా మిలియా ఇస్లామియా కాలేజీలో అనేక సంవత్సరాల పాటు ప్రొఫెసర్‌గా, ఛాన్సలర్ కూడా పనిచేశారు. అనేక మంది ప్రముఖులు చదువుకున్న ఈ కాలేజీ, ఎంతో చరిత్ర ఉన్న ఈ క్యాంపస్ ఇప్పుడు, ఒక జైలుగా, పోలీసు క్యాంపుగా మారింది అని విద్యార్థులు తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు. ఇతర విద్యార్థి సంఘాలు, అనేక యూనివర్శిటీల విద్యార్థులు కూడా జామియా మిలియా ఇస్లామియా విద్యార్థులకు మద్దతుగా ముందుకు వచ్చారు. వివిధ రాజకీయ పార్టీలు, యూనివర్శిటీ పూర్వవిద్యార్థులు కూడా విద్యార్థులతో చర్చించి వారి సమస్యలను పరిష్కరించాలి, పోలీసు బలగాలను తొలగించాలని పదే పదే విజ్ఞప్తి చేశారు. జామియా విద్యార్థులు 'ఆజాద్ కశ్మీర్' అంటూ గోడలపై గ్రాఫిక్స్, నినాదాలు రాశారని, ఇవి జాతి వ్యతిరేక చర్యలు అని పెద్ద ఎత్తున కొన్ని శక్తులు ప్రచారం చేస్తున్నాయి. తమ నిరసనతో ఎలాంటి సంబంధాలు లేని బయటి వ్యక్తులు, పోలీసులు కలిసి ఉద్దేశపూర్వకంగా, విద్యార్థులపై నిందలు వేసేందుకు, చేసిన పని ఇది అని, ఆ పేరుతో విద్యార్థులపై అక్రమ కేసులు బనాయించి, అరెస్టులు చేసే కుట్ర జరుగుతోందని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. క్యాంపస్ లోపల, బయట తమ ప్రతి కదలికలపై నిఘా పెడుతూ, అడ్డుకుంటున్న యూనివర్శిటీ సెక్యూరిటీకి, పోలీసులకు ఆ పని చేసిన వాళ్ళను తాము చూపించినా, వాళ్ళను పట్టుకోవడానికి వారికి ఎందుకు వీలు కావడం లేదని విద్యార్థులు ప్రశ్నిస్తున్నారు. జామియా చరిత్రలో విద్యార్థి ఆందోళనలు కొత్తవి కావు. 1990 లలో సల్మాన్ రష్దీ వివాదం, 2006లో యూనియన్ రద్దు, 2019లో సిఎ, ఎన్ఆర్‌సి వ్యతిరేక ఉద్యమం వంటివి ముఖ్యమైనవి. 2019 డిసెంబర్ 15న పోలీసులు క్యాంపస్‌లోకి ప్రవేశించి లైబ్రరీ (జాకీర్ హుస్సేన్ సెంట్రల్ లైబ్రరీ), మసీదు, క్లాస్ రూంలోకి వెళ్లి టియర్ గ్యాస్ వేశారు. విద్యార్థులను లాఠీలతో కొట్టారు. నేరస్థుల వలే వారిని చేతులు పైకెత్తి నడిపించారు. విద్యార్థులపై పోలీసులు, సాదా దుస్తుల్లోఉన్న వ్యక్తులు కలసి దాడి చేసినప్పుడు వందలాది మంది విద్యార్థులు గాయపడ్డారు. మహిళా విద్యార్థులపై కూడా అమానుష చర్యలు జరిగాయని ఆరోపణలు వచ్చాయి. ఆ నాడు సుమారు వంద మంది గాయపడ్డారు. 50మందికి పైగా నిర్బంధం, కేసులు ఎదుర్కొన్నారు. కొందరిని ఆసుపత్రినుంచి కూడా పోలీసులు అరెస్టు చేసి తీసుకెళ్లారు. జామియా చరిత్రలో ఇది ఒక మాయని మచ్చగా నిలిచిపోయింది. ఆనాటి ఆందోళనలు సమసిపోయినా, అవే సమస్యలు, ఎస్ఐఆర్ రూపంలో మళ్ళీ, మళ్ళీ మన ముందుకు వచ్చాయి. అలాగే ఎన్నాళ్ళ నుండో పెండింగ్‌లో ఉన్న 24 వేలకు పైగా ఉన్న జామియా మిలియా ఇస్లామియా విద్యార్థుల సమస్యలు కూడా ఇంకా పరిష్కారాలకై వేచిచూస్తున్నాయి. జామియా లోనూ కొత్త జన్‌జీ తరం వచ్చింది.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక

ఫిలిప్స్ విధ్వంసం.. అరుదైన ప్రపంచ రికార్డు సొంతం!

● **భారత్‌పై పరుగుల వరద.. ఒకే ద్వైపాక్షిక టీ20 సిరీస్‌లో అత్యధిక పరుగులు చేసిన న్యూజిలాండ్ బ్యాటర్‌గా ఘనత**

న్యూజిలాండ్ స్టార్ బ్యాటర్ గ్లెన్ ఫిలిప్స్ తన విధ్వంసకర బ్యాటింగ్‌తో అంతర్జాతీయ క్రికెట్‌లో అరుదైన రికార్డును సృష్టించాడు. భారత్‌తో జరిగిన టీ20 సిరీస్‌లో అద్భుత ప్రదర్శన కనబరిచి రికార్డుల పుస్తకాల్లో తన పేరును లిఖించుకున్నాడు. ముఖ్యంగా నాలుగో టీ20 మ్యాచ్‌లో భారత బౌలర్లపై విరుచుకుపడిన ఫిలిప్స్ భారీ సిక్సర్లు, బౌండరీలతో అభిమానులను అలరించాడు. కేవలం 46 బంతుల్లోనే శతకాన్ని పూర్తి చేసి తన బ్యాటింగ్ సత్తాను చాటుకున్నాడు.నాలుగో టీ20లో ఫిలిప్స్ 49 బంతుల్లో 107 పరుగులు సాధించాడు. ఇందులో 10 సిక్సర్లు, 4 ఫోర్లు ఉన్నాయి. అతడి దూకుడుతో న్యూజిలాండ్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 259 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఈ క్రమంలో భారత్‌పై టీ20ల్లో అత్యధిక స్కోరు నమోదు చేసిన జట్టుగా న్యూజిలాండ్ నిలిచింది.ఫిలిప్స్‌కు మరోవైపు మైఖేల్ బ్రేస్‌వెల్ అద్భుత సహకారం అందించాడు. బ్రేస్‌వెల్ కేవలం 25 బంతుల్లోనే 65 పరుగులు చేసి భారత బౌలర్లపై విరుచుకుపడ్డాడు. వీరిద్దరూ ఐదో వికెట్‌కు కేవలం 41 బంతుల్లోనే 115 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. దీంతో న్యూజిలాండ్ భారీ స్కోరు సాధించగలిగింది.ఈ సెంచరీతో ఫిలిప్స్ భారత్‌పై ఒక ద్వైపాక్షిక టీ20 సిరీస్‌లో అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్‌గా చరిత్ర సృష్టించాడు. నాలుగు మ్యాచ్‌ల్లో 92 సగటుతో 276 పరుగులు సాధించాడు. గతంలో వెస్టిండీస్ ఆటగాడు షాయ్ హోప్ భారత్‌పై సాధించిన 261 పరుగుల రికార్డును అధిగమించాడు. ఈ జాబితాలో ఇంగ్లండ్ ఆటగాడు హ్యారీ బ్రూక్ 229 పరుగులతో మూడో స్థానంలో, వెస్టిండీస్ ఆటగాడు షెర్ఫేన్ రూథర్‌ఫోర్డ్ 221 పరుగులతో నాలుగో స్థానంలో ఉన్నారు. అంతేకాకుండా ఫిలిప్స్ తన టీ20 అంతర్జాతీయ కెరీర్‌లో మూడో శతకాన్ని నమోదు చేశాడు. 46 బంతుల్లోనే సెంచరీ పూర్తి చేయడం ద్వారా న్యూజిలాండ్ తరఫున అత్యంత వేగంగా టీ20 శతకాలు సాధించిన ఆటగాళ్ల జాబితాలోనూ తన స్థానాన్ని మరింత పదిలం చేసుకున్నాడు. భారత్‌పై ఫిలిప్స్ చూపిన ఈ విధ్వంసకర బ్యాటింగ్ ప్రదర్శన క్రికెట్ అభిమానులను విశేషంగా ఆకట్టుకుంది.

టీ20 క్రికెట్‌లో రషీద్ ఖాన్ చరిత్ర.. 200 వికెట్ల అరుదైన ఘనత!

పురుషుల అంతర్జాతీయ టీ20ల్లో ఈ మైలురాయిని అందుకున్న తొలి బౌలర్‌గా రికార్డు.. రెండో స్థానంలో ఇంగ్లండ్ బౌలర్ ఆదిల్ రషీద్

అఫ్గానిస్థాన్ స్టార్ స్పిన్నర్ రషీద్ ఖాన్ అంతర్జాతీయ క్రికెట్‌లో సరికొత్త చరిత్ర సృష్టించాడు. పురుషుల అంతర్జాతీయ టీ20 క్రికెట్‌లో 200 వికెట్లు తీసిన తొలి బౌలర్‌గా అరుదైన ప్రపంచ రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు. జింబాబ్వేతో జరిగిన రెండో టీ20 మ్యాచ్‌లో ఈ ఘనత సాధించాడు. జింబాబ్వే బ్యాటర్ తడివనాషే మరుమానిని తొమ్మిదో ఓవర్‌లో ఎల్బీడబ్ల్యూగా ఔట్ చేయడం ద్వారా రషీద్ తన 200వ వికెట్‌ను పూర్తి చేసుకున్నాడు.రషీద్ ఖాన్ తన 120వ అంతర్జాతీయ టీ20 మ్యాచ్‌లోనే ఈ అరుదైన మైలురాయిని చేరుకోవడం విశేషం. 2015లో అంతర్జాతీయ టీ20ల్లో అరంగేట్రం చేసిన ఆయన, తన అద్భుతమైన స్పిన్ బౌలింగ్‌తో ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నాడు. తక్కువ పరుగులు ఇస్తూ కీలక సమయాల్లో వికెట్లు పడగొట్టడంలో రషీద్‌కు మంచి పేరుంది. ఇప్పటివరకు రెండు సార్లు ఐదు వికెట్ల ఘనత సాధించగా, 3 పరుగులకు 5 వికెట్లు పడగొట్టడం అతడి అత్యుత్తమ ప్రదర్శనగా నిలిచింది. **ఆదిల్ రషీద్‌కు అందనంత దూరంలో..**అంతర్జాతీయ టీ20ల్లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్ల జాబితాలో రషీద్ ఖాన్ అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. ఇంగ్లండ్ బౌలర్ ఆదిల్ రషీద్ 171 వికెట్లతో రెండో స్థానంలో ఉండగా, హాంకాంగ్‌కు చెందిన ఎహ్సాన్ ఖాన్, న్యూజిలాండ్ బౌలర్ ఇష్ సోధీ చెరో 165 వికెట్లతో తర్వాతి స్థానాల్లో ఉన్నారు. ఈ నేపథ్యంలో రషీద్ ఖాన్ రెండో స్థానంలో ఉన్న ఆదిల్ రషీద్ కంటే 29 వికెట్ల ఆధిక్యంలో నిలిచాడు. **బ్యాటింగ్‌లోనూ మెరిసిన రషీద్..** జింబాబ్వేతో జరిగిన ఈ మ్యాచ్‌లో రషీద్ బంతితోనే కాకుండా బ్యాట్‌తోనూ సత్తా చాటాడు. తొలుత బ్యాటింగ్ చేసిన అఫ్గానిస్థాన్ ఒక దశలో 38 పరుగులకే ఐదు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ సమయంలో అజ్మతుల్లా ఒమర్‌జాయ్ 50 బంతుల్లో 116 పరుగులతో అద్భుత శతకం సాధించగా, ఇజాజ్ అహ్మద్ అహ్మద్‌జాయ్ 27 బంతుల్లో 52 పరుగులు చేసి జట్టును ఆదుకున్నారు. వీరిద్దరూ ఆరో వికెట్‌కు 142 పరుగుల కీలక భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. చివర్లో కెప్టెన్ రషీద్ ఖాన్ కేవలం ఆరు బంతుల్లోనే అజేయంగా 25 పరుగులు సాధించాడు. ఇందులో నాలుగు సిక్సర్లు ఉండటం విశేషం.దీంతో అఫ్గానిస్థాన్ నిర్ణీత 20 ఓవర్లలో ఏడు వికెట్ల నష్టానికి 221 పరుగుల భారీ స్కోరు సాధించింది. లక్ష్య ఛేదనలో జింబాబ్వే కెప్టెన్ సికందర్ రజా అజేయ శతకంతో పోరాడినప్పటికీ, ఆ జట్టు 202 పరుగులకే పరిమితమైంది. దీంతో అఫ్గానిస్థాన్ 19 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఈ విజయంతో మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌ను మరో మ్యాచ్ మిగిలి ఉండగానే అఫ్గానిస్థాన్ కైవసం చేసుకుంది. అటు బ్యాటింగ్‌లోనూ, ఇటు బౌలింగ్‌లోనూ రాణించిన రషీద్ ఖాన్ తన కెరీర్‌లో మరో మైలురాయిని అందుకుని క్రికెట్ ప్రపంచం దృష్టిని ఆకర్షించాడు.

నాలుగో టీ20లో న్యూజిలాండ్ ఘన విజయం

- భారత్‌పై 87 పరుగుల తేడాతో గెలుపు.. సిరీస్‌లో తొలి విజయాన్ని అందుకున్న కివీస్

ఆక్లాండ్: భారత్‌తో జరిగిన నాలుగో టీ20 మ్యాచ్‌లో న్యూజిలాండ్ అద్భుత విజయాన్ని అందుకుంది. గ్లెన్ ఫిలిప్స్ విధ్వంసకర శతకం, మైఖేల్ బ్రేస్‌వెల్ మెరుపు అర్ధశతకం, జాకబ్ డఫీ పదునైన బౌలింగ్‌తో కివీస్ జట్టు 87 పరుగుల భారీ తేడాతో భారత్‌ను ఓడించింది. ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో వరుసగా మూడు విజయాలు సాధించి ఆధిక్యంలో ఉన్న భారత్‌కు ఈ మ్యాచ్‌లో ఎదురుదెబ్బ తగిలింది. అయితే ఇప్పటికే సిరీస్‌ను కైవసం చేసుకున్న టీమిండియా 3-1 ఆధిక్యంలో కొనసాగుతోంది.**ఫిలిప్స్, బ్రేస్‌వెల్ విధ్వంసం.. భారీ స్కోరు** టాస్ గెలిచిన భారత కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ తొలుత న్యూజిలాండ్‌ను బ్యాటింగ్‌కు ఆహ్వానించాడు. ఆరంభంలోనే టిమ్ సీఫెర్ట్ (3), డారిల్ మిచెల్ (24) వికెట్లు కోల్పోయిన కివీస్‌ను ఫిన్ అలెన్ (31) ఆదుకున్నాడు. అనంతరం గ్లెన్ ఫిలిప్స్ భారత బౌలర్లపై విరుచుకుపడ్డాడు. కేవలం 49 బంతుల్లో 6 ఫోర్లు, 10 సిక్సర్లతో 107 పరుగులు సాధించి అద్భుత శతకాన్ని నమోదు చేశాడు. అతడికి మైఖేల్ బ్రేస్‌వెల్ అద్భుత సహకారం అందించాడు. కేవలం 25 బంతుల్లో 6 సిక్సర్లు, 4 ఫోర్లతో 65 పరుగులు చేసి భారత బౌలర్లను ఉక్కిరిబిక్కిరి చేశాడు. వీరిద్దరూ ఐదో వికెట్‌కు కేవలం 41 బంతుల్లోనే 115 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. దీంతో న్యూజిలాండ్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 259 పరుగుల భారీ స్కోరు సాధించింది. భారత్‌పై టీ20ల్లో ఒక జట్టు సాధించిన అత్యధిక స్కోరుగా ఇది నిలిచింది.**ఆరంభంలోనే కుప్పకూలిన భారత్** 260 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన భారత జట్టుకు ఆరంభంలోనే షాక్ తగిలింది. న్యూజిలాండ్ పేసర్ జాకబ్ డఫీ తొలి ఓవర్‌లోనే సంజూ శాంసన్, ఇషాన్ కిషన్‌లను పెవిలియన్‌కు పంపి భారత్‌ను దెబ్బతీశాడు. అనంతరం వికెట్లు వరుసగా పడిపోవడంతో భారత జట్టు లక్ష్య ఛేదనలో వెనుకబడింది. అభిషేక్ శర్మ 27, శ్రేయస్ అయ్యర్ 22, నితీశ్ కుమార్ రెడ్డి 28, తిలక్ వర్మ 35 పరుగులు చేసినప్పటికీ జట్టును విజయతీరాలకు చేర్చలేకపోయారు. న్యూజిలాండ్ బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో భారత జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 172 పరుగులకే పరిమితమైంది.**డఫీ పదునైన బౌలింగ్.. కివీస్‌కు ఊరట** న్యూజిలాండ్ పేసర్ జాకబ్ డఫీ అద్భుత బౌలింగ్‌తో భారత బ్యాటర్లను కట్టడి చేశాడు. నాలుగు ఓవర్లలో 23 పరుగులు మాత్రమే ఇచ్చి నాలుగు వికెట్లు పడగొట్టాడు. మిచెల్ సాంట్నర్ కూడా కీలక వికెట్లు తీసి భారత పతనాన్ని వేగవంతం చేశాడు. దీంతో న్యూజిలాండ్ 87 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. వరుసగా మూడు ఓటముల తర్వాత కివీస్‌కు ఈ గెలుపు ఊరటనిచ్చింది. మరోవైపు భారత్‌కు న్యూజిలాండ్ గడ్డపై టీ20ల్లో ఉన్న అజేయ విజయాల పరంపరకు తెరపడింది. ఐదో, చివరి టీ20 మ్యాచ్ నవంబర్ 1న హామిల్టన్‌లో జరగనుంది.

అండర్-19 ఆసియా కప్‌కు భారత జట్టు ప్రకటన

● **జట్టులో సెహ్వాగ్, ద్రవిడ్ తనయులు.. కెప్టెన్‌గా లక్ష్య రాయ్‌చందానీ**

న్యూఢిల్లీ: అండర్-19 ఆసియా కప్ 2026 టోర్నమెంట్‌కు భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) 15 మంది సభ్యులతో కూడిన భారత జట్టును ప్రకటించింది. ఈ జట్టులో భారత క్రికెట్ దిగ్గజాలు వీరేంద్ర సెహ్వాగ్, రాహుల్ ద్రవిడ్ తనయులు ఆర్యవీర్ సెహ్వాగ్, అన్వయ్ ద్రవిడ్ చోటు దక్కించుకోవడం విశేషం. నవంబర్ 5 నుంచి 14 వరకు ఒమన్‌లోని మస్కట్ వేదికగా ఈ టోర్నీ జరగనుంది. భారత జట్టుకు లక్ష్య రాయ్‌చందానీ కెప్టెన్‌గా, యశ్వర్ధన్ సింగ్ చౌహాన్ వైస్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నారు.**మెరుగైన ప్రదర్శనతో జట్టులో చోటు** ఇటీవల జరిగిన వినూ మంకడ్ ట్రోఫీలో అద్భుత ప్రదర్శన కనబరిచిన ఆర్యవీర్, అన్వయ్‌లకు సెలెక్టర్లు అవకాశం కల్పించారు. ఢిల్లీ తరఫున ఆడుతున్న 19 ఏళ్ల ఆర్యవీర్ సెహ్వాగ్ చండీగఢ్‌తో జరిగిన మ్యాచ్‌లో 143 బంతుల్లో 173 పరుగులు సాధించి ఆకట్టుకున్నాడు. మరోవైపు కర్ణాటక తరఫున బరిలోకి దిగిన 17 ఏళ్ల అన్వయ్ ద్రవిడ్ గుజరాత్‌తో జరిగిన మ్యాచ్‌లో కేవలం 100 బంతుల్లోనే 151 పరుగులు సాధించాడు. గతంలో శ్రీలంకతో జరిగిన యువ వన్డే మ్యాచ్‌లోనూ అన్వయ్ 67 బంతుల్లో 87 పరుగులు చేసి తన ప్రతిభను చాటుకున్నాడు. ఈ ప్రదర్శనలే ఆసియా కప్ జట్టులో వారికి చోటు దక్కడానికి దోహదపడ్డాయి.**పాకిస్థాన్‌తో కీలక పోరు** ఈ టోర్నీలో భారత్ గ్రూప్-ఎలో చోటు దక్కించుకుంది. ఈ గ్రూపులో పాకిస్థాన్, నేపాల్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ జట్లు ఉన్నాయి. గ్రూప్-బిలో బంగ్లాదేశ్, శ్రీలంక, అఫ్గానిస్థాన్, మలేషియా జట్లు పోటీపడనున్నాయి. భారత్ నవంబర్ 6న నేపాల్‌తో తొలి మ్యాచ్ ఆడనుండగా, నవంబర్ 8న చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌తో తలపడనుంది. నవంబర్ 10న యూఏఈతో చివరి లీగ్ మ్యాచ్ ఆడనుంది. గ్రూపుల నుంచి తొలి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు నవంబర్ 12న జరిగే సెమీఫైనల్స్‌కు అర్హత సాధిస్తాయి. నవంబర్ 14న ఫైనల్ మ్యాచ్ జరగనుంది.భారత అండర్-19 జట్టు: లక్ష్య రాయ్‌చందానీ (కెప్టెన్), ఆర్యవీర్ సెహ్వాగ్, వి.కె. వినీత్, యశ్వర్ధన్ సింగ్ చౌహాన్ (వైస్ కెప్టెన్), కుషాగ్ర ఓజా, అర్జున్ రాజ్‌పుత్, మణాల్ చౌహాన్, అన్వయ్ ద్రవిడ్, రజత్ బఘేల్, వి. యశ్వీర్, ఆర్యన్ సావసాని, మోహిత్ ఉల్వా, కావ్య పటేల్, షవిన్ వినోద్, ఇషాన్ సూద్.

టీమిండియాకు ఎదురుదెబ్బ.. వన్డే సిరీస్‌కు స్టార్ పేసర్ దూరం!

- న్యూజిలాండ్‌తో సిరీస్‌కు ముందు గాయం కారణంగా ప్రసిద్ధ్ కృష్ణ ఔట్.. ఫిట్‌నెస్ సాధించడంలో విఫలం



న్యూఢిల్లీ: న్యూజిలాండ్‌తో త్వరలో ప్రారంభం కానున్న ఐదు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌కు ముందు భారత క్రికెట్ జట్టుకు ఎదురుదెబ్బ తగిలింది. స్టార్ పేసర్ ప్రసిద్ధ్ కృష్ణ గాయం కారణంగా ఈ సిరీస్ మొత్తానికి దూరమయ్యాడు. తొడ కండరాల గాయంతో బాధపడుతున్న అతడు ఇంకా పూర్తి స్థాయి ఫిట్‌నెస్ సాధించకపోవడంతో భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) ఈ నిర్ణయం తీసుకుంది. నవంబర్ 4 నుంచి న్యూజిలాండ్‌తో ప్రారంభం కానున్న వన్డే సిరీస్‌లో అతడి సేవలు అందుబాటులో ఉండవు.**వెస్టిండీస్ సిరీస్‌లో గాయం.. కోలుకోవడానికి మరింత సమయం** ఇటీవల వెస్టిండీస్‌తో స్వదేశంలో జరిగిన వన్డే సిరీస్ సందర్భంగా ప్రసిద్ధ్ కృష్ణ గాయపడ్డాడు. రెండో వన్డే సమయంలో తొడ కండరాలకు గాయం కావడంతో మైదానానికి దూరమయ్యాడు. అప్పటి నుంచి బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో పునరావాస చికిత్స పొందుతున్నాడు. వన్డే సిరీస్‌కు ఎంపికైనప్పటికీ అతడి భాగస్వామ్యం ఫిట్‌నెస్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించడంపై ఆధారపడి ఉంది. అయితే మ్యాచ్‌లు ఆడేందుకు అవసరమైన పూర్తి ఫిట్‌నెస్ సాధించడానికి మరింత సమయం కావాలని వైద్య బృందం సూచించింది. దీంతో న్యూజిలాండ్ పర్యటనలో వన్డే సిరీస్‌కు అతడిని దూరంగా ఉంచారు.**సిరాజ్‌కు ఇండియా-ఎ జట్టులో చోటు**మరోవైపు సీనియర్ పేసర్ మహమ్మద్ సిరాజ్‌ను న్యూజిలాండ్-ఎతో జరిగే రెండో నాలుగు రోజుల మ్యాచ్ కోసం ఇండియా-ఎ జట్టులోకి చేర్చారు. అక్టోబర్ 31 నుంచి క్రైస్ట్‌చర్చ్‌లో ఈ మ్యాచ్ ప్రారంభం కానుంది. టెస్టు సిరీస్‌కు ముందు మ్యాచ్ ప్రాక్టీస్ పొందేందుకు ఈ అవకాశం ఉపయోగపడనుంది. అలాగే ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డి తొలి వన్డే వరకు భారత జట్టుతోనే కొనసాగనున్నాడు. న్యూజిలాండ్-ఎతో జరిగే చివరి నాలుగు రోజుల మ్యాచ్ కోసం ఇండియా-ఎ జట్టులో చేరనున్నాడు.**నవంబర్ 4 నుంచి వన్డే సమరం**భారత్, న్యూజిలాండ్ జట్ల మధ్య ఐదు మ్యాచ్‌ల వన్డే సిరీస్ నవంబర్ 4న ఆక్లాండ్‌లో ప్రారంభం కానుంది.

'ఛావా' డైరెక్టర్ నుంచి మరో బయోపిక్..
ఆకట్టుకుంటున్న 'ఈరా' ట్రైలర్

బాలీవుడ్ నటి శ్రద్ధా కపూర్ ప్రధాన పాత్రలో నటిస్తున్న కొత్త చిత్రం 'ఈరా'. మహారాష్ట్రకు చెందిన ప్రముఖ లావణీ కళాకారిణి విఠాబాయి నారాయణ్‌గావ్‌కర్ జీవితం ఆధారంగా ఈ బయోపిక్ తెరకెక్కుతోంది. 'ఛావా' వంటి బ్లాక్‌బస్టర్ చిత్ర దర్శకుడు లక్ష్మణ్ ఉటేకర్ దీనికి దర్శకత్వం వహిస్తున్నారు. తాజాగా ఈ సినిమా ట్రైలర్‌ను మేకర్స్ విడుదల చేశారు.

మహారాష్ట్ర జానపద సంస్కృతిలో భాగమైన లావణీ నృత్యంలో ఆరితేరిన విఠాబాయి పాత్రలో శ్రద్ధా కపూర్ ఒదిగిపోయినట్లు ట్రైలర్ చూస్తే అర్థమవుతోంది. ఒక సాధారణ మహిళా కళాకారిణి తన ప్రయాణంలో ఎదుర్కొన్న సవాళ్లు, సాధించిన విజయాలను ఇందులో కళ్లకు కట్టినట్టు చూపించారు. ఇది శ్రద్ధా కెరీర్‌లోనే ఒక మైలురాయిగా నిలిచిపోయే పాత్ర అవుతుందని అంచనా వేస్తున్నారు. ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థ మాడాక్ ఫిలింస్ బ్యానర్‌పై దినేష్ విజాన్ నిర్మిస్తున్నారు. విలక్షణ నటుడు రణ్‌దీప్ హూడా కూడా ఈ చిత్రంలో ఒక కీలక పాత్రలో నటిస్తుండటంతో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసి, ఈ చిత్రాన్ని డిసెంబర్ 4న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల చేసేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు.

పాక్‌లోనూ 'రామాయణ' ఫీవర్..
రణ్‌బీర్ సినిమా కోసం కరాచీ హిందువుల పూజలు..

భారతీయ సినీ పరిశ్రమలో ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కిన చిత్రం 'రామాయణ: ది రైజ్ ఆఫ్ ఎ లెజెండ్'. దర్శకుడు నితీశ్ తివారీ రూపొందించిన ఈ సినిమా విడుదల తేదీ దగ్గర పడుతున్న కొద్దీ అంచనాలు పెరుగుతున్నాయి. కేవలం మన దేశంలోనే కాకుండా, సరిహద్దులు దాటి పాకిస్థాన్‌లోనూ ఈ సినిమాపై ఆసక్తి నెలకొంది. తాజాగా పాకిస్థాన్‌లోని కరాచీలో నివసిస్తున్న హిందూ సమాజం ఈ సినిమా విజయం కోసం ప్రత్యేక వేడుకలు నిర్వహించడం అందరి దృష్టిని ఆకర్షిస్తోంది.

స్థానిక యూట్యూబర్ షేర్ చేసిన ఒక వీడియోలో.. కరాచీలోని హిందువులు 'రామాయణ' సినిమా పోస్టర్‌ను పట్టుకుని వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. డప్పులు, సంప్రదాయ సంగీతం, నృత్యాలతో సందడి చేశారు. అనంతరం కరాచీలోని ప్రసిద్ధ లక్ష్మీనారాయణ ఆలయానికి చేరుకుని, అక్కడ సినిమా పోస్టర్‌ను ప్రదర్శించి, చిత్రం ఘన విజయం సాధించాలని ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రధాన పాత్రధారులైన రణ్‌బీర్ కపూర్, సాయి పల్లవి, దర్శకుడు నితీశ్ తివారీతో పాటు చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద భారీ విజయం సాధించడమే కాకుండా, ఆస్కార్ అవార్డును కూడా గెలుచుకోవాలని ఆకాంక్షించారు.

ఈ వేడుకల ద్వారా తమ సంతోషాన్ని, సినిమా బృందానికి శుభాకాంక్షలను పంచుకుంటున్నామని వారు తెలిపారు. "పాకిస్థానీ హిందువులమైన మాకు, రామాయణ కేవలం ఒక సినిమా కాదు. దాని కథ, సాంస్కృతిక ప్రాముఖ్యత మా సంప్రదాయాలతో, తరతరాల వారసత్వంతో మమ్మల్ని

కలుపుతుంది. ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా విజయవంతం కావాలని కోరుకుంటున్నాం" అని ఆ వీడియోలో పేర్కొన్నారు.

మరోవైపు, ఇటీవల లాస్ ఏంజిల్స్‌లో జరిగిన ప్రీమియర్ షో తర్వాత 'రామాయణ' సినిమాకు అద్భుతమైన స్పందన లభిస్తోంది. సినిమా చూసిన పలువురు లెటర్‌బాక్స్‌డ్‌లో తమ రివ్యూలను పంచుకున్నారు. నటీనటుల ప్రదర్శన, సంగీతం, విజువల్ ఎఫెక్ట్స్, భావోద్వేగ సన్నివేశాలను వారు ప్రత్యేకంగా ప్రశంసించారు.

ముఖ్యంగా శ్రీరాముడి పాత్రలో రణ్‌బీర్ కపూర్ నటన ఎంతో స్వచ్ఛంగా ఉందని, రావణుడిగా యశ్ నటన సినిమాకే హైలైట్‌గా నిలిచిందని కొనియాడారు. చాలా మంది ప్రేక్షకులు ఈ సినిమాకు ఫైవ్ స్టార్ రేటింగ్స్ ఇస్తూ, పౌరాణిక గాథను తెరపై ఆవిష్కరించిన తీరు అద్భుతంగా ఉందని పేర్కొన్నారు.

నమిత్ మల్హోత్రా నిర్మిస్తున్న ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టును రెండు భాగాలుగా తెరకెక్కిస్తున్నారు. మొదటి భాగం 'రామాయణ: ది రైజ్ ఆఫ్ ఎ లెజెండ్', దీపావళి కానుకగా నవంబర్ 5న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఇక రెండో భాగం 2027 దీపావళికి ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రంలో రణ్‌బీర్ కపూర్ రాముడిగా, సాయి పల్లవి సీతగా, యశ్ రావణుడిగా నటించారు.

చక్కనమ్మ చిక్కిందా?

బుల్లి తెర ద్వారా వెండి తెరపై అడుగు పెట్టి సుదీర్ఘ కాలంగా రంగుల ప్రపంచంలో వినోదాన్ని అందిస్తున్న ముద్దుగుమ్మ మృణాల్ ఠాకూర్. ఇండస్ట్రీలో అడుగు పెట్టి పుష్కర కాలం దాటింది. హిందీ సీరియల్స్, హిందీ సినిమాలతో ప్రేక్షకులను అలరించే ప్రయత్నం చేస్తూ వచ్చిన ముద్దుగుమ్మకు లక్కీగా తెలుగు సినిమా 'సీతారామం' సినిమాతో హిట్ పడింది. ఆ సినిమాలో చిన్న పాత్ర కోసం మృణాల్‌ను దర్శకుడు హను రాఘవపూడి కలవడం జరిగిందని, కానీ ఆమెను చూసిన తర్వాత సీతా మహాలక్ష్మి పాత్రకు మృణాల్ అయితేనే బాగుంటుందనే నమ్మకంతో ఆమెను నటింపజేశాడు. ఆయన నమ్మకంను మృణాల్ నిలుపుకుంది, అంతే కాకుండా సీతా మహాలక్ష్మి పాత్ర గురించి ఎప్పటికీ తెలుగు ప్రేక్షకులు చెప్పుకునే విధంగా నటించి, అందంగా కనిపించి మెప్పించింది. అందుకే సీతారామం సినిమా మృణాల్ కెరీర్ లో చాలా స్పెషల్ మూవీ అనడంలో సందేహం లేదు. హీరోయిన్‌గా మృణాల్ ఠాకూర్‌కి టాలీవుడ్ నుంచి మంచి ఆఫర్లు వచ్చాయి. కానీ ఈమెకు బాలీవుడ్‌లో స్టార్‌డం దక్కించుకోవడం ఆసక్తి. అందుకే టాలీవుడ్‌లో వరుసగా సినిమాలు చేస్తూ కూడా బాలీవుడ్‌లో ఆఫర్ల కోసం ప్రయత్నాలు చేస్తూనే ఉంటుంది. తెలుగులో డెకాయిట్ సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ అమ్మడికి మంచి హిట్ పడింది. అయితే తెలుగులో మరిన్ని సినిమాలు చేయడానికి మాత్రం ఈ అమ్మడు ఆసక్తి చూపడం లేదు అనేది కంప్లైంట్. బాలీవుడ్‌లో ఈ మధ్య కాలంలో రెండు సినిమాలతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఆ సినిమాల ఫలితంతో సంబంధం లేకుండా బ్యాక్ టు బ్యాక్ హిందీ సినిమాలు చేస్తూనే ఉంది. సౌత్ లో వస్తున్న ఆఫర్లను ఈమె సున్నితంగా తిరస్కరిస్తుందనే పుకార్లు వినిపిస్తున్నాయి. సౌత్ లో రాకా తర్వాత ఇప్పటి వరకు ఈమె కొత్త సినిమాను కమిట్ కాలేదు

9వ నెలలోనూ సమంత వర్కౌట్లు..

ప్రముఖ నటి సమంత ప్రస్తుతం తన ప్రెగ్నెన్సీలో చివరి దశను ఆస్వాదిస్తున్నారు. త్వరలోనే పండంటి బిడ్డకు జన్మనివ్వబోతున్న ఆమె, గర్భంతో ఉన్నప్పటికీ తన ఫిట్‌నెస్ పట్ల ఏమాత్రం రాజీ పడటం లేదు. తాజాగా తొమ్మిదో నెలలోకి అడుగుపెట్టిన సందర్భంగా తన గర్భధారణ ప్రయాణంలో ఫిట్‌నెస్ ఎంత ముఖ్యమో తెలియజేస్తూ ఒక స్ఫూర్తిదాయక వీడియోను సోషల్ మీడియాలో పంచుకున్నారు. 'చ9. ది ఫైనల్ ల్యాప్' (చివరి అంకం) అనే క్యాప్షన్‌తో ఆమె చేసిన ఈ పోస్ట్ ఇప్పుడు వైరల్ అవుతోంది. ఈ వీడియోలో సమంత తన గర్భం దాల్చిన మొదటి నెల నుంచి తొమ్మిదో నెల వరకు వివిధ దశల్లో చేసిన వర్కౌట్లను చూపించారు. ముఖ్యంగా, లేటెస్ట్ క్లిప్‌లో ఆమె ఛాతీకి దగ్గరగా డంబెల్ పట్టుకుని వెయిటెడ్ స్క్వాట్స్ చేయడం అందరినీ ఆకట్టుకుంటోంది. గర్భం కారణంగా తన శరీరం మార్పులకు అనుగుణంగా వ్యాయామ దినచర్యను ఎలా మార్చుకున్నారో సమంత గతంలోనే వివరించారు.

"ఈ రోజుల్లో ట్రైనింగ్ కాస్త భిన్నంగా ఉంది. ఎక్కువగా శ్రమించడం కంటే, శరీరం చెప్పేది వినడంపైనే ఎక్కువ దృష్టి పెడుతున్నాను" అని ఆమె గతంలో ఒక వర్కౌట్ పోస్ట్‌లో పేర్కొన్నారు. ఇప్పుడు ఆమె షేర్ చేసిన వీడియో కూడా అదే విషయాన్ని స్పష్టం చేస్తోంది.

కాగా, సమంత తన భర్త, ప్రముఖ ఫిల్మ్‌మేకర్ రాజ్ నిడిమోరుతో కలిసి తమ తొలి బిడ్డకు స్వాగతం పలకనున్నారు. కొద్ది వారాల క్రితం, ఈ జంట కోయంబత్తూరులోని సద్గురు ఈశా ఫౌండేషన్‌లో తమ కుటుంబ సభ్యులు, సన్నిహితుల మధ్య సంప్రదాయబద్ధంగా సీమంతం వేడుకను జరుపుకున్నారు. సమంత, రాజ్ 2025 డిసెంబర్‌లో ఇదే ఈశా యోగా సెంటర్‌లోని లింగ భైరవి ఆలయంలో వివాహం చేసుకున్న విషయం తెలిసిందే. సమంత పోస్ట్‌పై నటి కృతి కర్బందా స్పందిస్తూ.. "మీ ముగ్గురికీ నా ప్రేమ" అంటూ కామెంట్ చేశారు. సమంత ఫిట్‌నెస్ స్ఫూర్తిపై అభిమానులు, తోటి నటీనటులు ప్రశంసలు కురిపిస్తున్నారు. గర్భంతో ఉన్నప్పటికీ చురుకుగా ఉంటూ ఎంతో మందికి ఆమె ఆదర్శంగా నిలుస్తున్నారు

గొప్ప సందేశాన్నిచ్చే సినిమా

యువన్‌కృష్ణ ఎంటర్‌టైన్‌మెంట్స్, మనస్విని భాగ్యరాజ సమర్పణలో కార్తీక్ భాగ్యరాజ రచన, దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'డియర్ ఆస్ట్రోనాట్'. ఈ చిత్రంలో సౌమిత్, శ్రేయసి సేన్, కమల్ కామరాజు, గీతా భాస్కర్, చైత్ర ముఖ్య పాత్రలను పోషించారు. ఈ మూవీని నవంబర్ 20న విడుదల చేయనున్నారు. ఈ క్రమంలో నిర్వహించిన సాంగ్ లాంచ్ ఈవెంట్‌కి సెన్సిబుల్ డైరెక్టర్ శేఖర్ కమ్ముల ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడుతూ "ఆస్ట్రోనాట్ అవ్వాలనే కోరిక ఉండటం, ఆ కోరిక చుట్టూ కథను తీయడం బాగుంది. ఇది చాలా మంచి ప్రయోగం. ఎవరైనా సరే ఎంత పెద్ద కలలైనా కనొచ్చు, వాటిని సాకారం చేసుకోవచ్చు అనే గొప్ప సందేశాన్ని ఇచ్చేలా సినిమాని రూపొందించారు"అని అన్నారు. కమల్ కామరాజ్ మాట్లాడుతూ "కథకు ప్రాధాన్యమున్న చిత్రమిది. అందరికీ స్ఫూర్తినిచ్చే చిత్రమిది"అని తెలియజేశారు. సౌమిత్ మాట్లాడుతూ "డియర్ ఆస్ట్రోనాట్' చిత్రంలో అన్ని రకాల ఎమోషన్స్ ఉంటాయి. అందరికీ కనెక్ట్ అవుతుంది. ప్రేక్షకులు అందరి పాత్రలతో ప్రయాణం చేస్తారు. మా సినిమా కచ్చితంగా హిట్ అవుతుంది"అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శ్రేయసి సేన్, శరణ్య ప్రదీప్, గీతా భాస్కర్, గడ్డం వీరు, మార్తాండ్ కె వెంకటేష్, కార్తిక్, కృష్ణవేణి, మేఘన పాల్గొన్నారు.

Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District -500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State. Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613